ఆంధ్రభూమి

S.D. RAO

5



అభినేత్రి శ్రీమతి రాజ్యలక్ష్మి

మే, 1942

వెల 2 అణా[illegible]

భారతి

సంపుటం : ౧౦. చిత్రభాను, జ్యేష్ఠము : మే, 1942. సంచిక : ౬.

సంపాదకీయ వ్యాఖ్యలు

వెంకటగిరి రాజావారి ఉచితజ్ఞత.

యుద్ధనిధికి తెనుగు జమీందారులు విరివిగా విరాళాలు ఇస్తూవున్నారు. ఈనాడు యుద్ధం తెనుగు కోస్తాకు వచ్చివుంది. కాగా తెనుగుదేశంలో వసూలయ్యే యుద్ధనిధి తెలుగుదేశంలోని రక్షణకార్యాల కోసమే వ్యయింపబడడం అవసరం. శత్రు ప్రదేశాలను బాంబుచేయడానికి హిందూదేశం ఒక బేస్‌గా చేయనున్న వార్తలు వినవస్తున్నాయి. ఈవార్తలే నిజమైతే హిందూదేశంలోని ఇతర ప్రదేశాలతో బాటు తెనుగుదేశపు సముద్రతీరానికి శత్రువుల విమానపుదాడి భయం విస్తరించగలదు. అట్టి సమయాల్లో కాందిశీకులుకాగలవారి కోసమని కొంత నిధి ప్రత్యేకింపబడడం వాంఛనీయం. తెనుగు జమీందారులలో ఇంతవరకు ఈ వాంఛనీయవిషయాన్ని గుర్తించిన దీర్ఘదర్శులు ఒక్క వెంకటగిరిరాజాగారే కనిపిస్తున్నారు. ఏప్రిల్ కడపటివారంలో శ్రీవారు మదరాసు గవర్నరు యుద్ధనిధికి రెండువేల రూపాయల్ని ఇస్తూ అందులో ఐదువందల రూపాయిలు విశాఖపట్టణం, కాకినాడల్లో విమానపుదాడి బాధితులకు వినియోగించాలని ప్రత్యేకం కోరివున్నారు. ఇట్లు కోరడంలో వెంకటగిరిరాజావారు ప్రదర్శించిన ఆంధ్రాభిమానం ప్రశంసనీయమై ఆంధ్రదేశంలోని ఇతర జమీందారులకు ఆదర్శప్రాయమైనదై వుంది. తెనుగు జమీందారులు అవశ్యము అనుసరింపదగిన ఆదర్శాన్ని ప్రారంభించిన వెంకటగిరి రాజావారిని మేము హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము.

జాలయ్యశ్రేష్ఠిగారు: గుంటూరు అభివృద్ధి.

ఒక దేశానికేకాదు, ఒక రాష్ట్రానికేకాదు, ఒక నగరానికేకాదు వాటిరేఖ బయలుపడ్డప్పుడు ఆయా వానిని సేవించడానికి ఆదర్శప్రాయులైన పౌరులు వెలువడుతూవుంటారు. ఈ సత్యానికి ఇటీవలి గుంటూరు చరిత్ర చక్కని తార్కాణమైవుంది. తెనుగువారి పెద్ద పట్టణాలలో గుంటూరు ఒకటి. ఆ నగరానికి చిరకాలంగా నీటి ఇబ్బంది హెచ్చుగావుంది. ఆ ఇబ్బంది తొలగింపబడడానికి లోగడ అనేకప్రయత్నాలు సాగాయి. అందులో ఒక్కటి కూడా పనికిరాలేదు. ప్రజాప్రతినిధులు మంత్రులై, కాలం యుద్ధాది ఉపద్రవాలు లేక శాంతియుతమై వున్నప్పుడుకూడా గుంటూరుకు నీటి ఇబ్బంది తొలగే సూచనలు కానరాలేదు. ఇప్పుడు మదరాసు కోస్తాలో సలహాదారుల ప్రభుత్వం సాగుతూవుంది. పైగా ప్రపంచమంతా యుద్ధకార్యకలాపాలతో కలగుండువడివుంది, ఇట్టి పరిస్థితులలో ఒకానొక నగరపు వాటరువర్క్సు అభివృద్ధిస్కీము చేకొనబడడం అసాధారణవిషయం. గుంటూరుకు అట్టి అసాధారణ అదృష్టలాభాన్ని కలిగించిన పౌరసత్తముడు మునిసిపల్ ఛైర్మాన్, రావుబహదూర్ శ్రీ టి జాలయ్యశ్రేష్ఠి. మార్చి మాసాంతమున సంగం జాగర్లమూడివద్ద గుంటూరు వాటర్ సప్లయిస్కీముకు పునాదిరాయి వేస్తూ మదరాసు గవర్నరు సలహాదారు శ్రీ టి. జి. రూథర్‌ఫర్డు ఈ సంగతినే చెప్పాడు. తమ నగరీమతల్లికి ఇంతటిమేలు

చేకూర్చిన శ్రీజాలయ్య శ్రేష్టికి గుంటూరు పౌరులు విశేషంగా ఋణపడివున్నారు. శ్రీశ్రేష్టి హయాములో గుంటూరు మునిసిపాలిటీ అనేకవిషయాలలో హుటాహుటి నడలతో అభివృద్ధి పొందింది; పొందుతూవుంది ; పొందగలదు.

గవర్నరు యుద్ధనిధి: ఆంధ్రులు. ఏప్రిల్ మాసాంతానికి మదరాసు గవర్నరు యుద్ధనిధికి రూ. 2,02,33,811-6-8 వసూలయినది. అంటే రెండుకోట్లకు పైగా వసూలయింది. మదరాసు రాజధానిలో పన్నెండు తెనుగు మండలాలు, పన్నెండు అరవమండలాలు వున్నాయి. తెనుగు మండలాలకంటె అరవమండలాలు ఎక్కువ పట్టణాలు కలవి, ఎక్కువ ధనవంతమైనవి, ఎక్కువ ఆదాయపు పన్ను చెల్లించేవి, మదరాసు ప్రభుత్వంవారి ఎక్కువ అభిమానాన్ని చూరగొన్నవి ఐవున్నవి. ఐనప్పటికీ అవి ఈ యుద్ధనిధికి వసూలుఇవ్వడం విషయంలో తెలుగుమండలాలకి బాగా వెనుకపడివుండడం క్రింది అంకెలు రుజువుపరుస్తూవున్నాయి. గమనించండి:

తెలుగు జిల్లాలు

1	తూర్పుగోదావరి	...	13,87,493-14- 0
2	పశ్చిమగోదావరి	...	13,02,586-14-10
3	మదరాసునగరం (సగం)		6,25,384-13- 3
4	కృష్ణా	...	11,84,217-15-11
5	గుంటూరు	...	11,32,103- 3- 1
6	విశాఖపట్టణం	...	10,02,624- 0-10
7	కర్నూలు	...	8,75,999- 2- 7
8	నెల్లూరు	...	7,83,163- 6- 8
9	కడప	...	4,23,491- 9- 5
10	చిత్తూరు	...	3,89,163- 1- 3
11	బళ్లారి	...	3,40,849-10-10
12	అనంతపురం	...	3,31,308- 9- 6
			97,78,909- 6- 2

అరవ జిల్లాలు

1	కోయంబత్తూరు	...	13,95,504-12- 3
2	రామ్నాడు	...	11,56,076- 4- 2
3	తంజావూరు	...	11,32,118- 0- 5
4	మధుర	...	10,52,073- 6- 5
5	మదరాసునగరం (సగం)		6,25,384-13- 3
6	తిన్నవెల్లి	...	9,46,881-14- 4
7	ఉత్తర ఆర్కాటు	...	7,12,155-12- 8
8	తిరుచునాపల్లి	...	6,85,266-14-10
9	చెంగల్పట్టు	...	5,93,203-14- 9
10	సేలమ్	...	5,93,049-12- 9
11	దక్షిణ ఆర్కాటు	...	4,49,169- 8- 9
12	నీలగిరి	...	3,08,899-10- 5
			96,59,885-13- 0

ఇతర జిల్లాలు

మలబార్	...	5,47.752-9-9
దక్షిణ కనరా	...	1,75,113-3-3
ట్రావెన్కూర్	...	52,374-4-0
మైసూర్ - కూర్గు	...	20,380-2-6
		7,95,620-3-6

వసూలయిన రు 2,02,33,811-6-8 లలో తమిళాంధ్రేతర మండలాలు రు 7,95,620-3-6 మాత్రము ఇచ్చివున్నాయి. అరవ మండలాలు రు 96,59,885-13-0 లు— తెనుగు మండలాలు రు 97,78,909-6-2 లు ఇచ్చివున్నాయి. అరవలకంటె ఆంధ్రులు దాదాపు లక్షాఇరవై వేలు ఎక్కువ ఇచ్చివున్నట్లు తేలుతూవుంది. అరవలకంటె పేదలయ్యూ, మదరాసు గవర్నమెంటు అభిమానానికి దూరులయ్యూ అరవలకంటె అధికంగా నిధికి ఆంధ్రులు పైకం కూరుస్తున్నారు. ఐతే ఈ విషయం

మదరాసు ప్రభుత్వంవారు గుర్తించారా అన్నదే చాలా సంశయాస్పదమైవుంది.

ఆంధ్రరాష్ట్రము: పట్టాభి మానము. విశాఖపట్టణములో జరిగిన ఆంధ్ర మహాసభలకార్తినుంచీ మన భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు ఆంధ్రరాష్ట్రాందోళనపు ఉబుసు ఎత్తుకోక దానిని ఒక అస్పృశ్యవిషయంగా చూస్తూవున్నారు. ఆంధ్రసభలకు రాకపోతే మానింది సభలు జయప్రదంగా జరగాలని ఆశీర్వదిస్తూ వారు ఒక చిన్న సందేశాన్నయినా పోస్టుద్వారా పంపిన పాపాన్ని పోలేదు. ఆంధ్రసభలకు దరిమిలాను కాకినాడలో జరిగిన అఖలభారతమహిళాసభకు సందేశాన్ని పంపే ఔచిత్యాన్ని వారు పాటించారు. ఆంధ్రరాష్ట్రనిర్మాణ విషయంలో రాజాజీ ప్రకాశం వివాదాల్లో పట్టాభి పెదవి మెదపలేదు. దరిమిలానుకూడా వారు ఈ విషయంలో మౌనాన్నే వహించివున్నారు. సర్ స్టాఫర్డుక్రిప్సువద్దకు ఆంధ్రరాష్ట్రరాయబారం కొనిపోతూ సర్ విజయానందగజపతి పట్టాభిని తోడు రమ్మన్నాడు. ఈ చిన్నకోరికకుకూడా భోగరాజు ససేమిరా అన్నాడు. భోగరాజువారి ఆంధ్రరాష్ట్రాభిమానము నన్నుముట్టుకోకు నామాలకాకి పంథాలో పడిందేమి! సర్ విజయాతో క్రిప్సువద్దకు పోవ నిరాకరిస్తూ పట్టాభి దరిమిలాను ఆంధ్రరాష్ట్ర విషయంలో పూర్తి వివరాలుగల స్టేటుమెంటును ప్రచురిస్తామన్నారు. ఆ వాగ్దానాన్ని ఐనా ఆంధ్రులకు తృప్తికలిగే విధంగా భోగరాజువారు ఇంతవరకు పాటించలేదు. ఆంధ్రులకు అసహ్యమైవున్న ఈ మౌనాన్ని ఇకనైనా వారు వీడడం మంచిది. భోగరాజువారు చెవిని పెడతారా?

మెలుకువలు

బట్టలకు సోడా పెట్టేటప్పుడు అవలంబించవలసిన మెలుకువలు కొన్ని వున్నాయి. ముందు నీటిలో సోడా వేసి బాగా కలియనివ్వాలి.

ఆమీద ఆనీటిలో బట్టల్ని తడపాలి.

అంతేకాని బట్టలమీద ఎప్పుడూ సోడాను పడనీయకూడదు. పడనిస్తే బట్టలమీద మరకలు ఏర్పడడమే కాకుండా ఆ సోడా అక్కడ బట్టలను బాగా తిని వేస్తుంది.

వున్ని బట్టలు ఉతికే నీటిలో సోడా ఎప్పుడుకాని వేయకూడదు. వేసినట్టయితే వున్నిబట్టలు బాగా ముడుచుకుపోతాయి.

* * *

ప్రకటున దినానికి ఇండియాలో 216 వుత్తరాలు ఎట్టి చిరునామా కాని లేకుండా పోస్టు చేయబడుతున్నాయి. కాబట్టి ప్రతివారు పోస్టుచేసేముందు ఉత్తరాన్ని మరిఒకసారి పరకాయించడం మంచిది.

* * *

లండన్‌లో ఇప్పుడు పువ్వులు చాలా ఖరీదుగా వున్నాయి. ఒక పౌను పచ్చిద్రాక్షపళ్లు పదిహేను షిల్లింగులవరకు అమ్ముతూవుంది. ఆడవాళ్లు యుద్ధకార్యకలాపాల్లో చేరడంచేత లండన్ చిత్రకారులకు మోడల్ గరల్సుకూడా దొరకడంలేదు. కాబట్టి కొంతకాలంవరకు మనకు లండన్‌నుంచి కొత్త చిత్రాలు రావని గుర్తించుకోవాలి.

* * *

జాగ్రత్తలు

టర్పెంటైన్ కలిపిన సబ్బునీళ్ళలో తడిపితే రంగువేజోళ్ళ ధాతు ఏమీ తగ్గదు.

* * *

టేబిళ్ళపైన మనం సాధారణంగా వుపయోగించుకునే నారబట్టలమీద కాఫీ మరకలయితే దానిని ఉతికేముందు బంగాళాదుంపలు ఉడికించిన నీళ్ళలో ముంచాలి. అట్లా ముంచినట్లయితే ఆ మరక అతి సులభంగా పోతుంది.

* * *

దేనికైనా నూనెమరకలుకాని, కొవ్వు మరకలుకాని ఐతే ఆ మరకల్ని యూక్లిప్టస్ ఆయిల్ పోగొడుతుంది. చిన్నది, శుభ్రమైనది ఐన ఫ్లానల్ గుడ్డతో మరక వున్నచోట కొద్దిగా రుద్దాలి. మరక పోయేవరకు నెమ్మదిగా రుద్దాలి.

* * *

తివాసీమీద ఒలికిన సిరామరకల్ని తుడిచివేయడానికి ముందు అక్కడ వుప్పు వుంచాలి. ఒలికినసిరాని అంతా ఉప్పు పీల్చివేసేవరకువుండి ఆమీద అక్కడ నిమ్మకాయయొక్క సగం డిప్పతో రుద్దాలి. ఆమీద మామూలు నీటితో కడిగివేయాలి.

* * *

గ్రుడ్డులోని పచ్చని జొన చిలికి తలకు పట్టిస్తే షీకాయ, కుంకుడుకాయ కంటె తలను బాగా వదిలిస్తుంది. తలమీది జుట్టును వేడినీటిలో తడిపి తలకు జొన బాగా పట్టించి ఆమీద మామూలుగా రుద్దుకోవాలి.

* * *

భద్రతలు

దంతాలకి ఉప్పు చాలామంచిది. ఉప్పు పళ్ళకి పాచి పట్టకుండా కాపాడుతుంది; చిగుళ్ళని గట్టిపరుస్తుంది. వారానికి రెండుమూడు సారులు పళ్ళ బ్రష్షుమీద కొంచెం ఉప్పుపొడి వేస్తూవుండడం ఉపయోగకారిగా వుంటుంది.

* * *

విషమిశ్రితాలయిన ఔషధాలతో నిండివుండే సీసాల మెడలకు చుట్టూ చిరుగంటలు కట్టాలి. సీసా ఎత్తి మందు వంచేటప్పుడు అవి చప్పుడుచేసి అది విషమిశ్రితౌషధమనే సంగతిని- మనం పరాకుగా వున్నా- మనకు జ్ఞాపకం చేస్తుంది.

* * *

బంగాళాదుంపల్ని ఉడకబెట్టేప్పుడు గిన్నెమీద మూతపెట్టడానికి ముందు లోపల బంగాళాదుంపలమీద గుడ్డకప్పడం మంచిది. ఇట్లా గుడ్డకప్పితే అవి ఉడకడానికి తక్కువకాలంపడుతుంది. పైగా బంగాళాదుంపలు ఒలిచిన తరువాత పిండిపిండిగా చక్కగా విడతాయి.

* * *

గోడకు సున్నంకొట్టేటప్పుడు ఆ సున్నంలో కొద్దిగా ఉప్పుకలిపితే గోడకు వెల్ల బాగా అంటుకుంటుంది, తెల్లదనం ఏమీతక్కువదు.

జపానీయులు : పిల్లులు

జపానీయులు తమ దీవుల్లో కొన్నిటిని పిల్లుల నివాసానికి ప్రత్యేకించి వున్నారు. ఆదీవులమీదికి ఎవరుకాని కుక్కల్ని తీసుకు వెళ్ళకూడదని ఆంక్షవుంది. జపాన్ దీవుల్లో కొన్ని చోట్ల నక్కలవంటి పిల్లులు వున్నాయి:

ఇటీవల ప్రజామిత్ర పత్రికలో పిల్లుల్నిగురించిన పిచ్చినమ్మకాలు కొన్ని క్రోడీకరింపబడ్డాయి.

మార్చిమాసపు ఆంధ్రభూమి సంచికలో పిల్లుల్నిగూర్చిన సామెతలు కొన్ని గుదిగ్రుచ్చబడ్డాయి.

పిల్లుల్నిగురించిన ఆ పిచ్చినమ్మకాలు, ఈ సామెతలు పరికించి చూస్తే మానవప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో పిల్లులపట్ల ఎట్టి నమ్మికలు, గాథలు హత్తివున్నవో అవగతమవుతుంది

ఈనాడు దూరప్రాచ్యంలో దుందుడుకుతనాన్ని ప్రదర్శిస్తూవున్న జపానీయులకు పిల్లులనుగూర్చి గల పిచ్చినమ్మకాలు కొన్ని ఈ వ్యాసంలో ప్రత్యేకించి తడవడానికి ఉద్దేశించాను.

జపానీయుల కొన్నికొన్ని దీవుల్లోని పిల్లుల్నిగురించిన గాథలు వింటూవుంటే చాలా విడ్డూరంగా వుంటుంది.


జపాన్‌కు చెందిన రికుజెన్ మండలంలోని టాషిరో దీవి పిల్లుల స్వర్గధామమని చెప్పవచ్చు.

ఆపిల్లులదీవిమీదికి ఎవరుకాని కుక్కల్ని తీసుకురాకూడదు. తీసుకువచ్చినట్లయితే ఆ యజమానికి వెంటనే శాపం తగులుతుందని జపానీయుల నమ్మకం.

ఇజులోని షికైన్ దీవిలోనికి కూడా కుక్కల్ని తీసుకురాకూడదనే నిషేధంవుంది. ఏభై ఏళ్ళక్రితం వరకు అక్కడ పిల్లులు తప్ప మానవులు ఎవరూ నివశించేవారుకారు.

కురకామి అనే మరిఒక జపాన్ దీవికూడా కుక్కలరాకకు నిషేధితమైవుంది.

అయితే ఈ దీవులమీదికి కుక్కలరాక ఎందుకు నిషేధితమైనది ?



టోకియోనుంచి ప్రచురితమయ్యే 'కాన్‌టెంపరరీ జపాన్' అనే పత్రికలో 'కునియొ యనగిట' అనే రచయిత పై ప్రశ్నకు సమాధానంగా ఇట్లా వ్రాస్తున్నాడు:

పైన పేర్కొన్న దీవులన్నీ పూర్వము శ్మశానాలుగా ఉపయోగింపబడేవి. శవాల్ని తగులబెట్టకుండాను, పాతిపెట్టకుండాను అక్కడవుంచేసేవారు. అవి క్రమంగా సికస్తుపడి బూడిదలో కలిసిపోయేవి. ఈలోగా ఆశవాలు జంతువులకు ఆహారంకాకుండా వుండడం ముఖ్యం. జంతువులనుండి అట్టి శవాల్ని రక్షించడానికి దీవులకంటె అనుకూలమైన ప్రదేశాలు మరి లేవు కదా !

కాని జనాభా పెరిగినకొద్దీ శ్మశానాలకు అనుకూలమైనవి, చిన్నవి, నిర్జనమైనవి ఐన దీవులు దొరకడం దుస్తరమైపోయింది. కాగా కాలక్రమాన్ని శవాల్ని కాల్చే, పాతిపెట్టే ఆచారాలు అమల్లోకి వచ్చాయి.

తోడేళ్లు, నక్కలు మున్నగు వాటికంటె శవాలకి కుక్కలు ఎక్కువ హానిచేసేవికావు. కాని తోడేళ్ళకంటె, నక్కలకంటె కుక్కలు జనపదాల్లో నిర్భయంగా తిరుగుతాయి.

అందుచేత పై దీవులలోనికి కుక్కలను తీసుకురాకూడదనే నిషేధం పుట్టి వుంటుంది.

కాని కాలక్రమాన్ని ఈ కారణం విస్మరింపబడి వుంటుంది. కుక్కలకు విరోధజంతువులయిన పిల్లులు నివశిస్తూవున్నాయి కాబట్టి ఈ దీవులకు కుక్కలు కొనిరాబడ కూడదనే నిషేధం పుట్టివుంటుందనే నమ్మకం పాదుకొని వుంటుంది.

పిల్లులవద్ద ఒకవిధమైన అభూత శక్తి వుందనీ, ఆశక్తివల్ల అవి ఆదీవిమీదకు కుక్కల్ని కొనివచ్చిన వారిని శపించి శిక్షిస్తాయనీ ప్రజల్లో నమ్మకం ఏర్పడిపోయింది.

కుక్కలకు, పిల్లులకు బద్ధవైరం అన్నమాట లోకసత్యమే కాని అంతమాత్రంచేత కుక్కలకు నిషేధితమైనదీవి పిల్లులకే ప్రత్యేకింపబడాలని లేదు.

పిల్లుల్నిగూర్చి సాంప్రదాయసిద్ధంగా వచ్చే కథలు పరామర్శిస్తే పిల్లులు తమ యజమానుల్నికూడా లెక్కించక ఒక్కొక్కప్పుడు స్వతంత్రంగా కాపురవుస్థలాలు ఏర్పరుచుకుంటాయని తేలుతుంది.

ఓకిదీవిమీద నివశించే జపానీయుల్లో పలువురు పిల్లులు పోయి కొండల్లోనివశిస్తాయని నమ్ముతారు.

ఇళ్ళల్లో కాక బయట నివశించేటప్పుడు పిల్లులు ఇతరజంతువుల మాంసాలుతిని బ్రతుకుతాయి. ఓకిదీవిమీద ఎక్కడా నక్కలులేవు.

కాని, వింత ఏమిటంటే ఇతరచోట్ల నక్కలుచేసే దారుణ కార్యాలన్నీ ఇక్కడపిల్లులే చేయడం—

ఓకి దీవిలోని కొండకనుమల్లోనూ, అడువుల్లోనూ పిల్లులు మెండుకొని నివశిస్తున్నాయి.

అడవిదారుల్లో అవి పొంచి వుంటాయి. పల్లెవాళ్లు సముద్రంలో చేపలు పట్టుకుని చేపలతో నిండిన బుట్టలతో ఆదారులవెంట ఒంటరిగా పోతూవుంటే ఈపిల్లులు గుంపులుగావచ్చి వాళ్ళని బెదిరిస్తాయి.

అ బెదురుతో బేజారెత్తి వారు చేపలబుట్టల్ని అక్కడ విడిచిపెట్టి పలాయనం చిత్తగిస్తారు. అప్పుడు ఆపిల్లులు ఆచేపల్ని కడుపు ఉబ్బేటట్లు తినివేస్తాయి.

సాట్సునూకు పశ్చిమోత్తర దిశగావున్న అకూన్‌కు చెంతగల వరిపొలాలు ఇటీవల పిల్లులకూడలిగా ప్రఖ్యాతి వహించాయి.

ప్రభుత్వపు చట్టం ప్రకారం ఆ ప్రదేశం ప్రత్యేకంగా పక్షుల విహారానికి వదిలివేయబడింది. ఆ ప్రాంతాలకు ఎవరుకాని కుక్కల్ని తీసుకొనిపోకూడదనే ఆంక్ష వుండేది.

ఇట్లా వుంటూవుండగా ఒక వింత విషయం నడిచింది.

ఊళ్ళోవున్న పిల్లులన్నీ ఉబ్బెత్తుగా చెలరేగి ఇళ్లు వదలి ఈవరిపొలాల్లోకి వచ్చి తిష్ఠవేశాయి.

దొరికిన చిన్న పక్షుల నన్నిటినీ తిని బాగా బలిశాయి. ఇంతట్లో వసంతకాలం కడచన్నది. బాగా అచ్చటి పక్షులన్నీ ఎగిరిపోయాయి.

అప్పుడు అక్కడ ఆహారం దొరక్క పిల్లులన్నీ తిరిగి ఇళ్ళకువచ్చాయి. కొద్ది వారాల్లోనే కొవ్వుతీసి మామూలు పిల్లు లయ్యాయి.

పొట్టితనమూ, దిట్టతనమూ

'పొట్టి దిట్ట' అనే నానుడి సహేతుకమైనదని శాస్త్రమూ, చరిత్రా నిదర్శించడం ఈ వ్యాసంలో నిరూపితమైంది. ప్రపంచప్రముఖుల్లో పలువురు పొట్టివారు. వారి పొట్టితనమే వారి ప్రాముఖ్యానికి కారణమైందని చెప్పవచ్చు.

ఎత్తయిన విగ్రహం నిండుతనానికి ఒక ముఖ్యలక్షణంగా మనవారు ఎంచారు.

అయితే మనకు పొడుగరితనం రావడానికి అనేకమైన అనుకూలాలు వుండాలి.

పరంపరగా పొట్టివారు పుట్టే వంశంలో పొడుగువారు పుట్టరు.

తల్లిదండ్రులు ఇద్దరూ పొట్టివారయితే వారి సంతానం ప్రాయికంగా పొట్టిగానే వుంటుంది.

ఒకమనిషి పొడుగుగానో, పొట్టిగానో వుండడానికి వాతావరణం కూడా కొంతవరకు కారణభూతమై వుంటుంది.

ఆహారపుష్టి, మనిషి అలవాట్లు కూడా ఈ విషయంలో గమనింపదగినవే ఐ వుంటాయి.

ఇవే కాదు ఇంకా అనేక కారణాలు మనిషియొక్క పొట్టి లేక పొడుగు కాయాలకు దోహదప్రాయాలయి వుంటాయి.

పొడుగుపాటి పురుషులకు పుట్టిన పిల్లలు సాధారణంగా పొడుగువారై వుంటారు. కాని అది ఒక సూత్రంగా చెప్పలేము. పొడుగుపాటి దంపతులు పిల్లలు తరుచు పొడుగ్గానే వుంటారు. కాని పొట్టిగా వుండడంకూడా కద్దు.

పొట్టిగా పుట్టినవారిని పొడుగుగా చేయడానికి ఇప్పుడు పరిశోధనలు సాగుతున్నాయి. ప్రత్యేకమైన ఆహారం, కొన్నిరకాల దేహపరిశ్రమ పొట్టిపిల్లల్ని పొడుగుగా చేయడానికి ఉపయోగపడడం దుస్తరంకాదనే విషయాన్ని ఇటీవలి పరిశోధనలు కొన్ని రూపించాయి.

ఈపరిశోధనలు పండబారితే ప్రపంచంలోని మానవులందరూ కొంచెం ఇంచుమించుగా ఒక్కటే పొడుగులోవుండే అసందర్భం ఏర్పడవచ్చునని స్విడ్జర్లాండులోని ఒక శాస్త్రవేత్త భయపడుతున్నాడు.

ఆరు అడుగులుకాని, అంతకు పైనకాని వున్నవారందరూ పొడుగైనవారిగా పరిగణింపబడుతున్నారు.

ఐదు అడుగులకు లోపుగా కాని, ఒకటి రెండు అంగుళాలు పెచ్చుగా కాని వున్నవాళ్ళందరూ పొట్టివారికిందే లెక్క.

పొట్టివారు సాధారణంగా దేహవిషయంలో తమకు కలిగిన లొమ్చును బుద్ధివిషయంలో పెంపొందించుకుని పొడుగరులకంటె పైచేయిగా వుండడానికి ప్రయత్నిస్తారు.

ఈ ప్రయత్నాలవల్లనే పొట్టివాడు గట్టివాడు అనే నానుడి ఏర్పడడానికి హేతువయింది.

పొడుగువాళ్ళను మించుదామనే ఈ ఆకాంక్ష పొట్టివాళ్ళలో మిక్కిలి చిన్నతనంనుంచీ పొడచూపుతుంది.

పాఠశాలల్లో పస్తునూర్కులన్నీ పొట్టివాళ్ళే పొందుతూవుండడం పరిపాటి. బుద్ధిబలంలో పొడుగువాణ్ణి మించాముకదా అనే తృప్తి పొట్టివాడు పొందుతాడు. వాడి దేహంకంటె నాది దీర్ఘకాయం కదా అని పొడుగువాడు కులుకుతాడు.

ఈ పరిణామం ఒక్క పాఠశాలల్లోనే కాదు. తరువాతి జీవితయాత్రలో కూడా ఇట్లే వుంటుంది.

పొడుగువానికంటె పొట్టివానికి మహత్వాకాంక్ష, కీర్తివాంఛ ఎక్కువగా వుంటుంది;

అందుచేతనే వ్యాపారదక్షుల్లో, రాజకీయవేత్తల్లో మనకు తరుచు

పొడుగువారికంటె పొట్టివారు ఎక్కువగా కనిపిస్తారు.

తనకు భగవంతుడు కల్పించిన పొట్టితనమనే లోపాన్ని తొలగించుకుని పొడుగువాణ్ణి మించుదామనే తీవ్రకాంక్షలో, తీవ్రదీక్షలో పొట్టివాడు బాగా అభివృద్ధికివస్తాడు.

మనస్తత్వశాస్త్రపారంగతుడైన డాక్టర్ జంగ్ ఈ సందర్భంలో చెప్పినమాటలు వినదగివున్నాయి :

'పొట్టివాడు తనకంటె పొడుగువాణ్ణి చూచినప్పుడల్లా తాను వాణ్ణి మించాలనే సంగతిని జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. మరి పొడుగుపాటివాడో? వాడి కంటె మనం ఉన్నతులమై వున్నాము కదా అనే తృప్తిభావాన్ని పొందుతాడు. తనకంటె పొట్టివాళ్ళను చూచినప్పుడల్లా పొడుగుపాటి వాళ్ళకు అందరికీ ఇట్టి తృప్తిభావమే కలుగుతూ వుంటుంది. తృప్తి అన్నది అభివృద్ధికి వేరుపురుగుకదా !

ఆధునికచారిత్రక పత్రాన్నుండి ఇందుకు నిదర్శనంగా పెక్కు విషయాల్ని ఎత్తి చూపవచ్చు.

ఫ్రాంసు రాజకీయవేత్తల్లో పీరీ ఫ్లాండిన్ బాగా పొడగరి; పీరీలావల్ బాగా పొట్టి. పొడుగు ఫ్లాండిన్ చాలాసారులు పొట్టి లావల్‌కు అధికారాన్ని అప్పగిస్తూవచ్చాడు.

పొట్టిలావల్ చాలా చురుకైనవాడు, చొరవైనవాడు. తాను ఫ్రెంచి ఫ్యూరర్ కావాలనే ఆకాంక్ష అతనికి చిరకాలంగా వుండింది. ఆ ఆకాంక్ష ఇప్పుడు కొంతవరకు పండబారేటట్లుగా వుంది.

నాజీనాయకుడైన హిట్లర్, ఫాసిస్టు ప్రముఖుడైన ముసోలినీ ఇద్దరూ పొట్టివారే.

వలసరాజ్యాల్లో మామూలు సైనికుడుగా వుంటూ తన దీక్షవల్ల స్పెయిన్ దేశపు నియంత ఐన ఫ్రాంకోకూడా పొట్టివాడే.

స్విడ్జర్లాండులో మూడు టరములుగా అధ్యక్షస్థానానికి వస్తూవున్న ముగ్గురు మహనీయులు కూడా (ఐదు అడుగుల) పొట్టివాళ్ళే.

వ్యక్తుల విషయంలోనే కాదు. జాతులవిషయంలోకూడా పొట్టితనం మహత్తరగుణంగానే కనిపిస్తూవుంది.

చూడండి: జపాన్ జాతి మిక్కిలి పొట్టిజాతి. ఈనాడు ఆపొట్టిజాతి దూరప్రాచ్యాన్నంతా ఆపోశనం పట్టి అజేయంగావుంది.

ఇక యూరప్‌జాతుల సంగతిని గమనిద్దాము.

నార్వేప్రజలు దీర్ఘకాయులు. వారు ఇప్పుడు జర్మన్లకు దాసులైవున్నారు. స్వీడిష్ ప్రజలుకూడా పొడుగుపాటివారే. వారికి ఈనాడు యూరప్ రాజకీయాల్లో ఎట్టి ప్రాముఖ్యమున్నూ లేదు.

చరిత్రప్రసిద్ధులైన ఈ క్రింది ఆర్గురు మహావ్యక్తులున్నూ పొట్టివారై వుండడం క్రింది అంకెలు తెలుపుతాయి :

	అడుగులు	అంగుళాలు
జూలియస్ సీజరు ...	5	2
నెపోలియన్ బోనపార్టీ	5	1
అలెగ్జాండరు దిగ్రేట్	5	3
లెనిన్ ...	4	11
సన్ యట్ సేన్ ...	5	0
జనరల్ బోథా ...	5	1

పొట్టివారు ఏకాగ్రచిత్తులై యోగాభ్యాసానికి ఎక్కువ అనువుపడివుంటారని భారతదేశంలో అనుభవజ్ఞులు చెబుతారు. మల్లయుద్ధంలో పొట్టితనమే ఎక్కువ అనుకూలంగా వుంటుందని జపానీయుల నమ్మకం.

పురుషుల విషయంలోనే కాదు —స్త్రీల విషయంలోకూడా పొట్టితనం వరణీయంగానే కనిపిస్తూవుంది.

హాలీవుడ్‌లోని గ్లామర్ గరల్సులో పలువురు పొడుగుపాటివారూ, సన్నపాటివారూ కావడం కాదనరానిదే.

కాని హాలీవుడ్‌లో ఏడాదికి ఇరవై వేల పౌనులు సంబళం పుచ్చుకునే సినీమాతారలు ప్రాయకంగా పొట్టివారే.

మెర్లీ ఓబిరన్- వీవియన్ లే- అన్నాబెల్లా- జానెట్ గేనర్- జోన్ బెన్నెట్- సోన్జాహెనీ మున్నగు సినీమాతార లంతా ఐదుఅడుగుల వర్గంలోని వారే.

మనపంటలు : ఖనిజాలు

ఆంధ్రదేశంలో
పండే పంటల్నీ, దొరికే ఖనిజాల్నీ
సింహావలోకనంచేసే చిన్న వ్యాసం.

రచయిత :

కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్.యమ్.ఇ.

౧

ఆంధ్రదేశమున పాడి పంటలు సమృద్ధి.

పంటలకు ముఖ్యమైనది జలాధారము. ఆంధ్రదేశమును పవిత్రమైన గోదావరి, కృష్ణా, తుంగభద్రా, పెన్న, ఋషికుల్యాదినదులు పునీతంచేస్తున్నాయి. వాటి నీరుకొంతవరకైనా వ్యవసాయమునకు దోహదం చేస్తున్నది. ఈజలాశయములను ప్రజలు పూర్తిగా ఉపయోగించుకొనే అదృష్టము ఆంధ్రులకు లేకపోయినా యితర రాష్ట్రములతో పోల్చిచూచినచో వ్యవసాయంలో యిది ప్రథమస్థానం పొందగలదు. అంటే దామాషాను చూస్తే బెంగాలు, బిహారు, పంజాబు రాష్ట్రాలలోని అభివృద్ధికి తులతూగక పోయినా ఎందునా తీసిపోదని నా అభిప్రాయం.

నదులవల్ల, చెరువులవల్ల సాగుబడి అగుటేకాక వర్షాధారంవల్ల సాగుఅయ్యేపొలాలుకూడా చాలా వున్నాయి. రాయలసీమలో జలాధారపు పంటలు చాలా స్వల్పం. మొత్తంమీద ఆంధ్రదేశం ఉష్ణప్రదేశం.

రాయలసీమలో సాగుబడి అయ్యే భూములు చాలవరకు నల్లరేగడి భూములు. సర్కారులలో అవి చాలావరకు డెల్టాభూములు, లంకలు అని చెప్పవచ్చు.

పల్లపుభూములు మినహాయిస్తే యిక వున్నవి మెరకభూములు. అక్కడ మన్ను ఎర్రమన్ను. ఈ గరువులు తోటలకు బాగా వుంటాయి.

పశువులచే లాగబడే నాగళ్ళ సహాయమున సాగుబడి జరుగుతూ వుంది. విత్తనములు చల్లుటకు పూర్వం పొలములలోనికి ఎరువుతోలి ఎనుమూరు ముమ్మారు దున్నుతారు, తొలకరించగానే మరి ఒకసారి దున్ని విత్తనాలు చల్లుతారు.

వ్యవసాయానికి ఉపయోగపడే పశువులను మందల మందలగా మేపుతూవుంటారు. దుక్కిటెడ్లను ప్రత్యేకంగా మేపుతారు. వాటికొరకు ప్రత్యేకంగా బీళ్ళు వదలుతారు. అదికాక వట్టిగడ్డి, జొన్న, చొప్ప, ఉలవపొట్టు, మినప, పెసర, శనగపొట్టు, పత్తిగింజలు, తెలికపిండి, ఉలవలు మొదలగు వాటిని పెడతారు.

ఎరువు కొరకు మేకలను గొర్రెలను మందలుకట్టిస్తారు. వట్టిరోజుల్లో ఆ మందలను కొండలలోను, అడవులలోను మేపుతారు.

పశువులలో నెల్లూరుజిల్లాలోని ఒంగోలు రకం, బొబ్బిలి గొడుపోతులు సుప్రసిద్ధములైనవి. ఇవికాక పుంగనూరు (చిత్తూరుజిల్లా) దూపాడ ఎర్రమల ప్రాంతంలోని పశువులుకూడా శ్రేష్ఠమైనవే. ఆంధ్రదేశంలో గుర్రముల పెంపకం చాలాతక్కువ.

పొలాల్లో ఉపయోగపడే ఎరువులు చాలా తక్కువ. ఈమధ్య పాశ్చాత్యప్రాబల్యంవల్ల ఏవేవో కొన్ని ఎరువులు మార్కెటులోనికి వచ్చినా వాటిని విరివిగా ఉపయోగించే తాహతు మనరైతువర్గమునకు లేనిస్థితి ఏర్పడింది. బాగా తగిన సత్తువచేసి సాగుచేయలేకండా వున్నారు కాని పెంట,

గొప్ప ఇంటర్వ్యూ

అమెరికన్ అధ్యక్షుడుగా వుండిన కాల్విన్ కూలిడ్జిదగ్గరకు ఇంటర్వ్యూకోరి ఒకసారి ప్రెస్ రిపోర్టరు ఒకడు వచ్చాడు.

'మద్యపాన నిషేధాన్ని గురించి మీరు ఏమైనా చెప్పదలచారా?' అన్నది పత్రికాప్రతినిధి మొదటి ప్రశ్న.

'లేదు' అని సమాధానం.

'వ్యవసాయాన్ని గురించి ఏమైనా చెప్పదలచారా?'

'లేదు.'

'ప్రపంచ న్యాయస్థాన స్థాపనను గురించి ఏమైనా తెలపాలని వున్నదా?'

'లేదు.'

అందుమీద ప్రెస్‌రిపోర్టరు వెళ్లిపోవడానికి లేచాడు.

పోతూవున్న వాణ్ణి ఆపి కూలిడ్జి 'నేను చెప్పిన వాక్యాలేవీ ఉల్లేఖించకుమీ' అని అన్నాడు.

— Stewart Anderson in Sparks of Laughter.

చెరువులున్న తోటలుకొంటూనే వుంటారు.

తూర్పు కనుములనుండి ప్రవహించు నదులకు ఆనకట్టలు కట్టబడి ఉన్నాయి. వాటిద్వారా నీటిని కాలువలకు పంపి సాగుబడికి అనుకూలం చేసింది ప్రభుత్వం.

ఇవికాక 33000 పంట చెరువులున్నాయి. వానివల్ల సుమారు 6 మిలియన్ల ఎకరములు సాగుబడి అవుతున్నవి. ఇవికాక నూతుల మూలకంగా కొంతవరకు సాగు అవుతున్నది.

తెలుగు గడ్డమీద పండే పంటలలో ధాన్యము ప్రధానమైంది. మొత్తంపంటలో నాలుగోవంతు. ఒక ఎకరానికి ఇరవై బస్తాలవరకు పండుతుంది. ఈపంట పండుటకు సుమారు 5 మాసములు పట్టుతుంది.

దీనితరువాత పేర్కొనదగినవి జొన్న, గంటి, చోడి, ఉలవ, ప్రత్తి, అపరదినుసులు, మినుము, కంది, ఉలవ; శనగ, పెసర, నువ్వు, ఆవ, వేరుశనగ, బుడమ, చామ మొదలైన మెరకపంటలు.

పల్లపుపంటలలో ధాన్యం తరువాత పేర్కొనదగినది చెరకు.

ఈ మధ్యను పొగాకుపంట విస్తారముగా విరాజిల్లుచున్నది. నీలిమందుకూడా కొన్నిచోట్ల పైరు చేయుచున్నారు కాని విస్తారము కాదు.

సింహాచలం కొండలమీద అనాసపంట అపరిమితం.

మన్యపు అడవులలో కమలాఫలములపంట విస్తారము. కొబ్బరితోటలకు గోదావరి డెల్టాభూములు ప్రసిద్ధికెక్కినవి. కోనసీమ కొబ్బరికి పెట్టింది పేరు.

కూరగాయలు పాటి పెరళ్ళలో చిత్తంవచ్చినట్టు పండుతాయి. వంగ, బెండ, కాకర, ఆనబ, గుమ్మడి మొదలైనవి చెప్పతగినవి.

పంటల తరువాత తోటలు. తోటల్లో ముఖ్యంగా చెప్పతగినవి మామిడి, అరటి, నిమ్మ, కొబ్బరి, చింత, వెలగ, బత్తాయి, నారింజ,

---

కడుపు స్వగతం

ఈభూమిమీద నేనేదేవుణ్ణి కాబట్టి, ఓ మానవుల్లారా! నాకు మొక్కండి.

మీరందరూ నా బావుటాక్రిందకు రండి.

నేను బలవంతుల అందరికంటె బలవంతుణ్ణి. ఈప్రపంచంలో నా కంటె గొప్పవారు ఎవరూ లేరు.

నాపేరు 'కడుపు'

నాకు ఏది కావాలని కోరుతానో అవి నాకు లభ్యమౌతాయి.

ఆకలి, దప్పి అనేవి నాస్నేహితులు. అవి తమ జిహ్వాజ్వాలలను చాచి కోరికల్ని తృప్తిపరుచుకుంటాయి.

విందులన్నీ నాకోసమే. నేను నిండితే తేనుపువస్తుంది.

నేను ఒకప్పుడు ఉదాత్తంగా తింటాను. ఒకనిద్రపోయి లేచానంటే నేను తిరిగి భోజనానికి సిద్ధమై వుంటాను.

నాకోసమని మహర్షులు పాపులయ్యారు, మహాశయులు దొంగలయ్యారు.

వీరులు, దేశభక్తులు నాకోసమని పిరికిపందలయిపోయారు.

ఈ లోకంలోని తిరుగుబాట్లకు, హత్యలకు నేనే కారణం.

నాకోసమని కొడుకులు తండ్రులను ఇళ్లలోనుంచి వెడలగొట్టారు; తల్లితండ్రులను విడిచి కూతుళ్లు పరాయిపంచలకు పోయారు.

న్యాయపథగాములు కూడా నాకోసమని అన్యాయమార్గాలు అవలంబించారు.

మానవుడు ఎంతకష్టపడ్డా నాకోసమే.

తమలపాకులతోటలు. వెయ్యకుండా పెరిగేవి తాటితోటలు

గోదావరి డెల్టాలలో కొబ్బరితోటలు, అరటితోటలు విరివిగా వేసి పెంచుతారు.

మనదేశంలో కొబ్బరి తాటి పీచుల వర్తకం అభివృద్ధిలోకి వస్తోంది. కొబ్బరి డొక్కలను నాన వేసి చితక్కొట్టి పీచుగాతీస్తారు ఆ పీచుతో కొబ్బరితాళ్ళు తివాసులు కాళ్ళుతుడుచుకునే మెత్తలు మొదలైనవి అనేకం తయారు చేస్తున్నారు.

మనదేశంలో ఈడిగాళ్ళు తాటి, ఈత, కొబ్బరి కల్లుతీతలో ఎక్కువగా పనిచేస్తారు. కొబ్బరి కల్లు మన ప్రాంతాలలో విరివిగా వాడరు. అరవదేశంలో అది అధికం. ఈకల్లుకాచి బెల్లంచేస్తారు.

ఈ బెల్లంనుండి పంచదార తయారవుతుంది.

౨

ఖనిజ సంపత్తిలో ముఖ్యమైనది లవణము. సముద్రతీరమునందలి మళ్ళలో నీరు నిలవచేసి వుంచుతారు. అది కొద్దికాలమునకు యినికి, యిగిరి పోవును. ఆ నీటిలోనున్న ఘనపదార్థము ఆ బీళ్ళలో మిగులుతుంది. అదేఉప్పు. పూర్వం బళ్ళారి ప్రాంతంలోమట్టి నుండికూడా ఉప్పుతీసేవారు.

ఉప్పు తరువాత ఆంధ్రదేశంలో దొరికే ఖనిజాల్లో పేర్కొనదగినవి మాంగనీస్, అభ్రకము, సూరేకారము.

బంకమన్ను, కడపరాళ్లు, సున్నంరాళ్ళు మొదలైన గృహనిర్మాణోపయోగమైన రాళ్ళుకూడా మన దేశంలో దొరకుతాయి.

మాంగనీసు విజయనగర సంస్థానంలో అపరిమితంగావుంది. సాలీనా సుమారు 63000 టన్నుల ముడి

పదార్థం యింగ్లాండుకి ఎగుమతి అవుతూవుండేది విశాఖపట్టణం రేవు నుండి. ఈ ఖనిజం సాండూరు సంస్థానంలో కూడా విరివిగావుంది. 1893 లో మొదట విజయనగరం మైనింగ్ కంపెనీ ప్రారంభమైంది.

అభ్రకపుగనులు నెల్లూరుజిల్లాలో అమితం. వాటిని త్రవ్వడం 1887 లో ప్రారంభించారు. అభ్రకం అచ్చులు అచ్చులుగా తళతళలాడుతూ వుంటుంది. దీనిని త్రవ్వి బాగుచేసి యునైటెడ్ కింగ్‌డంకు పంపుతున్నారు, గూడూరు, రామ్‌పూరు, ఆత్మకూరు, కావలి ప్రాంతాలలో విస్తారంగాదొరుకుతుంది. మైకాయొక్క విలువ విద్యుద్దీపాలు విరివిగా వచ్చాక హెచ్చింది. ఈ లోహమునకున్న శుభలక్షణాలు మరి ఏ ఇతర లోహములకు లేవు. దీనిద్వారా విద్యుచ్ఛక్తి ప్రవహించదు. కాగా దీన్ని ఇన్స్యులేటరుగానూ, ఎలక్ట్రిక్ ఏపరేటస్సులలోను ఉపయోగిస్తారు. ప్రపంచంలో ఉత్పత్తిఅయే మైకాలో 60 పాళ్లు యిండియా సరఫరా చేస్తోంది. అందులో నాలుగోవంతు మన నెల్లూరుభూముల్లో దొరుకుతోంది.

సబ్బురాయి. అనేది కర్నూలు జిల్లా ముడవరాము అనే గ్రామంలో దొరుకుతుంది. ఈ గ్రామం బేతంచెర్లకు 7 మైళ్లు. వీటితో రాతిచిప్పలు, బొమ్మలు మొదలైనవి చేస్తారు.

బెంగుళూరులో నల్ల సీనారాయి బాగా దొరుకుతుంది. క్రిష్ణాజిల్లాలో సుద్దరాయి, పాలరాయి బాగా దొరుకుతుంది. వాటితోనే అమరావతీ స్థూపాలు నిర్మించారు.

యింటింటా వెలసే కడపరాళ్లు కడపజిల్లాలోని గనులనుండి త్రవ్వి బాగుచేసి ఎగుమతిచేస్తారు. దేవాలయాల్లో నిత్యం దర్శనమిచ్చే రాతి విగ్రహాలకు అనువైన నల్లరాయి కూడా రాయలసీమలో ఆ ప్రాంతంలో విరివిగా లభించుతుంది.

బెడనూరు, రటసంగంపల్లి మొదలగు ప్రదేశాల్లో ఒకమాదిరి బొగ్గు లభించింది కాని దానిని పూర్తిగా పరిశోధించి పనిచేసినవారు లేకపోయారు.

ప్రస్తుతం మైసూరు రాజ్యంలో చేరియున్న ఆంధ్ర కోలారులో కొంతవరకు బంగారం లభిస్తోవుంది.

అనంతపురం జిల్లాలో వజ్రకరూర్ గ్రామ ప్రాంతములలో వజ్రపురాళ్ళు దొరుకుతూవుంటాయి. అవి చాలా అరుదుగా దొరుకుట వల్ల ఆ పరిశ్రమ వృద్ధికాలేదు.

నెల్లూరుజిల్లా యర్రపల్లి గ్రామంలో రాగి దొరుకుతుందని కనిపెట్టారు. కాని అగని విస్తారంగా లేనందున దానిని త్రవ్వే ఉద్యమం మానుకున్నారు.

—'తెలుగు గెడ్డ' నుండి.

చిక్కు ప్రశ్నలు

౧

ఒక పదము ఐదక్షరములు. మొదటి అక్షరము తీసివేసిన ముంగిస అవును. రెండవ యక్షరమును వదలిన వంగడమును దెల్పుమాట అవును. ఆపదమేది.

౨

తల తోక కనులుగలది యొకటి. దానికి ప్రాణములేదు. అదెయ్యది?

౩

వనితాలలామా! నీపేరేమన్న ఎడమకన్నుసుజూపె. మగనిపేరేమన్న జీర్ణవసనమునుజూపె. సంతానమేమైన కలదాయన్న అభ్రతలమునసున్న చుక్కల జూపె. ఏకులమన్న పంజరమందలి పక్షిని జూపె. ఊరేదన్న గొల్లనిజూపె. మగనిపని యేమన్న నమస్కృతియొనర్చె. ఆ సాధ్వీలలామయెవరు?

జవాబులు

1. ఇవకులము, నకులము, కులము.
2. పాము కుబుసము.
3. వామాక్షి, కుచేలుడు, ఇరువదియేడు, ద్విజకులము (బ్రాహ్మణులు), కృష్ణుడు, తపస్సు.

దెయ్యాలురాకుండా మేకులు

ఇనపమేకుల మాంత్రికశక్తి—

పన్నుపోటు పోవడానికి చెట్టుకు మేకు—

చచ్చేవాళ్లు దెయ్యాలు కాకుండా వాళ్ల చేతులకు మేకులు—

మంచాలకు మేకులుకొడితే కలలు రావు—

భూమికి మేకులుకొడితే భూకంపంరాదు—

'మధ్య మాగాణపు ఆదిమ జాతీయుల్లో బెయిగా జాతీయుల ఆచారాలు మనకు చాలా వింతగా వుంటాయి.

బెయిగా జాతీయుల జనపదాన్ని పెద్దపులి ఒకటి పీడిస్తూ వుండినది. ఆపులి మనుష్యమాంసానికి రుచి మరిగి బెయిగా పల్లెని పట్టి పీడిస్తూ వుండేది. దానిపీడ వదిలించుకోవాలంటే దాని నోరు కట్టివేయాలి కదా!

దానినోరు కట్టివేయడానికిగాను బెయిగా మాంత్రికులు ఇనపమేకుల్ని మంత్రించి ఒక చెట్టు కాండానికి కొట్టారు.'

అని ఈ సంగతిని స్వయంగా చూచిన వెర్రియర్ ఎల్విన్ పత్రికల్లో బయట పెట్టాడు.

చెట్టుకు కొట్టిన ఇనపమేకులకు నిజంగా అంత మహాత్తువుందా?

ఆధునికనాగరికతలో ఇనుము ఉపయోగం అనంతమైంది కావడం కాదనరానిది.

ఆఖరికి అది మన మందుల్లో కూడా విశేషంగా వాడబడుతూ వుంది. నీరసపడిపోయిన వారికి ఆయుర్వేదవైద్యులు లోహాసవం ఇస్తారు.

ఇనుమును ఈనాడు నాగరికులు ఇంతగా ఉపయోగిస్తూవున్నా ఇనప మేకుల్లో మాంత్రికశక్తి వుందనే విషయం వారికి తెలియదు.

తెలియకపోయినా శతాబ్దులుగా ఇనపమేకులు ఆదిమవాసులచేత మాంత్రికవిషయాలకు విరివిగా వాడబడుతూ వున్నాయి.

ఈ వాడకం ఒక్క హిందూదేశంలోనే కాదు, ప్రపంచమందంతటా వుంది.

మాంత్రికవిషయాల్లో ఒక్క ఇనప మేకులేకాదు– ఇనప ఉంగరాలు, ఇనపకత్తులు, ఇనప కొడవళ్ళుకూడా ఉపయోగకరాలయినవే.

ఈ ఇనుప పనిముట్లకన్నిటిలోకీ మాంత్రికవిషయాల్లో ఎక్కువగా ఉపయోగింపబడేవి మేకులే. ఇనుముకుగల మంచిగుణాలన్నీ మేకులద్వారా నరుడు పొందవచ్చునని అన్ని దేశాల్లోనూ, అన్నికాలాల్లోనూ మాంత్రికులు నమ్మివుండినారు.

పంజాబులో ఎవరికేనా పన్నుపోటువస్తే ఆపోటు పోవడానికి మాంత్రికుడు చెట్టుకు మేకు కొడతాడు. లేదా కాగితంమీద మంత్రాక్షరాలు వ్రాసి దానిని మడతపెట్టి దానిమీద మేకు కొడతాడు.

చెట్లకు మేకులు కొట్టేఆచారం పంజాబులోనే కాదు పారశీకదేశంలోకూడావుంది. పారశీక దేశంలోని పవిత్రస్థలాల, ప్రార్థన మందిరాల చెంతగల పవిత్రవృక్షాలకన్నిటికీ మేకులు కొట్టబడి వుంటాయి.

మేకుల విషయంలో చైనాలో కూడా ఇట్టి నమ్మకంవుంది. చైనాలో పట్టుపురుగులు నివశించే పూతికవృక్షాలు ఎక్కువ. ఆవృక్షాల్ని ఒక ఆడదెయ్యం ఆశ్రయించి వుంటుందని చైనా జాతీయులనమ్మకం. ఆ చెట్టుకి పొడుగు మేకులు కొడితే ఆదెయ్యం వదిలిపోతుందని వారు విశ్వసిస్తారు.

తన తలలో ఈమేకు దిగడంతోటే దెయ్యం మానవరూపాన్ని ధరిస్తుంది.

మన దేశంలోని బస్తరు రాజ్యంలో ప్రసవవేదనలో ఒకస్త్రీ చావసిద్ధమైవున్నప్పుడు ఆమె చచ్చి దెయ్యం కాకుండా ఆమె అరచే

తుల్లో, పాదాల్లో, మోకాళ్లల్లో మేకులు దిగకొడతారు.

బస్తరు రాజ్యంలోని జగదాల్‌పూర్‌లో దసరా ఉత్సవ సందర్భాలలో కొత్తరథం నిర్మించబడ్డప్పుడు ఆ రథంయొక్క ప్రధానమైన దూలానికి సవర జాతీయుడు ఇనపమేకు కొడతాడు. అట్లా కొట్టడంవల్ల ఆరథానికి ఎట్టికీడూ వుండదని సవరల నమ్మకం.

పూర్వకాలంలో రోమనులు తమ కుటీరాల్లోకి ప్లేగుజాడ్యం ప్రవేశించకుండా గోడలకు పొడుగు మేకులు కొట్టేవారు.

సమాధుల్లోనుంచి ఏరి తెచ్చిన మేకులు తలుపులకు కొడితే ఆయింటికి రాత్రిళ్ళు భూతబాధ వుండదని ప్లినీ చెబుతున్నాడు.

కోడి గుడ్లు పెట్టేచోట చిన్న మేకు పడేస్తే పెట్ట పెట్టే గుడ్లకు ఏమీ అపాయంవుండదనే నమ్మిక పదో శతాబ్దినుంచీ వున్నట్లు జియోపానికా చెబుతున్నది.

కాండలకి, కొమ్మలకి మేకులు కొట్టబడ్డ చెట్లు ప్రపంచమంతటా అక్కడక్కడ కానవస్తాయి. మేకులు కొట్టడమే కాకుండా చెట్లకు పాత గుడ్డపేలికలు కట్టడంకూడా అక్కడక్కడ ఆచారంగావుంది.

శత్రువులకు పీడ కలిగించడానికి మంత్ర తంత్రాల్లో జపానీయులు మేకులు వాడతారు. ఇట్టి సందర్భాలలో వారు చెట్లకు మేకులు కొడతారు. ఇట్లా మేకులు కొట్టడంవల్ల ఆవృక్షాన్ని ఆశ్రయించి వున్న భూతం ప్రకోపించి మేకు కొట్టడంలో ఉద్దిష్టమైన వ్యక్తిని పీడిస్తుందని వారు నమ్ముతారు.

విల్లో అనే ఒకజాతిచెట్టు ఆకు రాలుతూవుండగా దానిలో సూది గుచ్చితే పంటిపోటుబాధ తగ్గుతుందని జపానీయుల నమ్మకం.

మేకుల సందర్భమైనది చైనాలో మరి ఒక విడ్డూరపు నమ్మకం వుంది. ఒకానొక గర్భిణి దుర్భరమైన ప్రసవవేదన పడుతూవుంటే ఆయింటిగోడలకు, తలుపులకు లోగడ అజాగ్రత్తతో కొట్టబడ్డ మేకులన్నీ పీకివేయాలి. పరాకుగా కొట్టబడ్డ ఆమేకులు ఏదోభూభూతాన్ని బాధపెడుతూవుండివుండవచ్చుననీ, అట్లా బాధపడుతూవున్న ఆభూభూతం కసిచేత గర్భిణీస్త్రీని గారిస్తూవుండవచ్చుననీ చైనీయులు నమ్ముతారు.

క్రైస్తవమత ప్రవిష్టులుకూడా మేకుల్ని పవిత్రంగా చూస్తారు.

ఏసుక్రీస్తు నిర్యాణానికీ, మేకులకు సంబంధంవుంది కదా!

ఈస్టర్ పండగలలో గుడ్ ఫ్రయిడేనాడు ఇంగ్లండులో కమ్మరపనివాళ్ళు పని ఏమీచేయరు.

ఇంగ్లండు చెంతగల ఐల్ ఆఫ్ మాన్‌లో ఆనాడు ఇనపముక్క ఏదికాని నిప్పులో పెట్టకూడదు. అసలు ఆనాడు కొలుముతే వెలిగించకూడదు. వెలిగించి వున్నట్లయితే ఆదమరుపుగా ఎవరయినా ఆ నిప్పులో ఇనపముక్కలు పడవేయవచ్చునని వారి భయం. ఆనాడు పెనాన్నికాల్చి రొట్టెలు కాల్చుకోకూడదు. ఇస్త్రీ పెట్టెలో బొగ్గులువేసి బట్టలు ఇస్త్రీ చేసుకోకూడదు.

హిందూదేశపు అడవుల్లోని గ్రామీయుల మాంత్రికపు పనుల్లో ఇనుపమేకులు నేటికిన్నీ ప్రాధాన్యాన్ని వహించివున్నాయి.

అగేరియా జాతీయుల్లో మాంత్రికపు పనులకు ఉపయోగింపబడే

చెంపలుకోసే మంగలి

బెంజిమన్ ఫ్రాన్క్లిన్ అమెరికన్ రాయబారిగా పారిస్ నగరంలో వుంటూవుండేటప్పుడు. కార్యాంతరంమీద గాంబొలెట్ అనే పురం వెళ్ళాడు. అక్కడ అతడు క్షౌరంచేయించుకోవలసి వచ్చింది. ఒక మంగలిషాపుకి వెళ్ళాడు. ఆ షాపులో తాను ఒక కుర్చీలో కూచున్నవెనుక తన కాళ్ళ దగ్గర ఒక చిన్న కుక్క కూచుని అది తన వంక తదేకదృష్టితో చూస్తున్నట్టు ఫ్రాంక్లిన్ గ్రహించాడు.

ఫ్రాన్క్లిన్ 'ఆకుక్క ఎందుకలా చూస్తోందని' ఆ మంగలిని అడిగాడు. అతడు నవ్వుతో 'అయ్యా! ఏమీలేదు. అలా కూచోడం దానికి అలవాటు. నేను క్షౌరంచేసేటప్పుడు చెంపలు తెగిపోతే వృథాపోనీయకుండా అది సొమ్ముచేస్తూ వుంటుం'దన్నాడు.

'తప్పుడువార్త తంటా'

ఆరుగురు జర్మన్ వైమానికులు వీర స్వర్గద్వారం చేరి దడదడ తలుపుతట్టారట. ద్వారపాలకుడు ఎవరువారని పృచ్ఛించాడు.

'మేము జర్మన్ వైమానికులము. యింగ్లాండుపై చేసిన విమాన దాడులలో మరణించాము. లోనికి రావచ్చునా?' అని అడిగారు.

సమాధానం చెప్పకుండా ఆ ద్వారపాలకుడు తలుపుమూసికొని లోనికి పోయాడు. కొంతసేపు తాళి తలుపు వోరవాకలిగా తెరిచి 'సరే, మీలో యిద్దరికి మాత్రం ఈ స్వర్గలోకంలో కాలుబెట్టడానికి అనుమతి వుంది' న్నాడు. 'మేము ఆరుగురమున్నామే మిగతా నలుగురిసంగతీ ఏమి'టన్నారు వారు.

'జర్మన్ హైకమాండు ప్రకటనప్రకారం ఇంగ్లాండుపై దాడివెడలిన వైమానికులలో ఇద్దరే మరణించారని వుంది కాబట్టి ఆ యిద్దరూ లోనికి రావచ్చు. మిగతావారు నరకలోకానికి వెళ్ళవచ్చు' నని చెప్పాడా ద్వారపాలకుడు.

ఈ కట్టుకథ చెప్పుకుని పారిస్ ప్రజలు నవ్వుకుంటూ వుంటారు.

వంగీయుల ఉగాది

వైశాఖశుద్ధపాడ్యమి వంగ సంవత్సరాది. వంగీయులకు ఆపర్వానికి సంబంధించిన ప్రత్యేకోత్సవం ఏమీ లేదు.

కాని పలువురు మిత్రుల్ని విందుకు పిలిచి, చుట్టాలకు బహుమతులుపంపి, పరిచితులకు అభినందనాలు సమర్పించి వారు ఆపర్వాన్ని జరుపుకుంటారు.

వంగ వర్తకులు మాత్రం ఆపండుగ విషయంలో చాలా పట్టింపుగా వుంటారు. ఆనాడు వారు కొత్త చిఠా, ఆవర్జాలు పెడతారు. ఆనాటికి పాత బాకీలన్నీ వసూలుచేసుకుంటారు.

సంవత్సరాదినాడు వ్యాపారంబాగా సాగితే సంవత్సరంపొడుగునా వ్యాపారం బాగా వుంటుందని వంగవర్తకుల నమ్మకం.

ఇనుపమేకులు కొత్తగా గనుల నుండి తవ్విన ఇనుముతో చేయబడాలనే నమ్మకంవుంది. గనుల నుండి కొత్తగా ఇనుము తవ్వవలసి రావడమే కాకుండా ఆ మేకులు చేసే కొలుములుకూడా కొత్తవై వుండాలి. అంటే ఆ కొలుముల్లో ఈమేకులే మొదట చేయబడేవి కావాలన్నమాట.

ఆ కొలుములలో ఉపయోగింపబడే అగ్గికూడా కొత్తదై వుండాలి. అంటే అగ్గిపుల్ల, చెకుముకిరాయి మొదలయినవి వాడి నిప్పుచేయకూడదు. యాగాదులలోవలె రెండు కర్రలు మథించి నిప్పుచేయాలి. ఆకొలిమితిత్తుల్ని పెళ్ళికాని ఆడపిల్ల ఊదాలి. పైగా పని అంతా సూర్యుడు నెత్తిమీదకు రాకుండా పూర్వాహ్నమే పూర్తి కావాలి.

ఇన్ని జాగ్రత్తలు తీసుకుని తయారుచేయబడిన ఆ లోహం గుణాన్వితమై వుంటుంది.

ఆ ఇనుమునుండి అగేరియా జాతీయులు చిన్నచిన్న ఇనపమేకులు తయారుచేస్తారు, వాటిని వారు బహుభద్రంగా జాగ్రత్త చేస్తారు.

ప్రతి సంవత్సరము దీపావళినాడు వారు ఆ మేకుల్ని తమ ఆవకి నాలుగుదిక్కులా; తమ తలుపులకు, ద్వారబంధాలకు; ధాన్యపు భోషాణాలకు; పొయ్యిలకు; కొయ్యతిరగళ్ళకు; స్తంభాలకు; కొలతపాత్రలకు; పశువులశాల తలుపులకు దిగవేస్తారు.

తమ గ్రామానికి గల నాలుగు పొలిమేరలలోనూ వుండే పెద్ద చెట్లకుకూడా ఈమేకులు కొడతారు. ఇట్లా కొట్టడంవల్ల పెద్దపులులు, దెయ్యాలు, రోగాలు తమ జనపదపు ధరిదాపునా రావని వారి నమ్మకం.

అగేరియా జాతీయుల్ని ఆపద నుండి కాపాడే రక్షలన్నమాట ఈ మేకులు.

మంచాలకి కొట్టినమేకులు ఆ మంచంమీద నిద్రపోయే వానికి పాముకలలు రాకుండా, దెయ్యాల బాధ లేకుండా చేస్తాయి.

గాదికి కొట్టినమేకులు ఆగాదిచెంతకు ఎలకలు రాకుండా కాపాడతాయి.

పొయ్యికి కొట్టినమేకులు ఆ పొయ్యిమీద కాగే పాలని పొంగి

పోకుండానూ, మిగల కాకుండా నూ భద్రపరుస్తాయి.

పశువులశాలకి కొట్టినమేకలు పశువులకు ఎట్టివిధమైన వ్యాధులూ రాకుండా చేస్తాయి.

కొలుములకు నాలుగుదిక్కులా మేకులు కొడితే ఆ కొలుములికి దెయ్యాలపీడ అసలు వుండదు.

ఇంటికి కొట్టిన మేకలు ఆ యింటిమీద పిడుగులుపడకుండా కాపాడతాయి.

బీహారులో భూకంపం వచ్చినప్పుడు అచ్చటి అగేరియా, బెయిగా జాతీయులు ఇట్టి మేకుల్ని పెక్కింటిని భూమిలోకి దిగకొట్టారు.

భూకంపం తగ్గిపోయాక ఆ జాతీయుల్లోని మాంత్రికులు మేము మేకుల్ని దిగగొట్టిన తరువాతనేకదా భూకంపం ఆగిపోయిందని డప్పాలు కొట్టేవారు.

సృష్టిక్రమమే మాంత్రికపు మేకులతో ప్రారంభమైందని బెయిగా జాతీయుల నమ్మకం.

భగవంతుడు ముందు బెయిగా జాతీయుల్ని సృష్టించాడట. ఆ మీద భూమిని చేశాడట. భూమిని ఒక చపాటీమాదిరిగా చేశాడట. ఆ చపాటీమీద మనుష్యులందరూ ఒక్కసారి పరుగెత్తితే అది ఒరిగిపోయేదట. అప్పుడు భగవంతుడు బెయిగా జాతీయుల్నిపంపి దానిని సరి చేయమన్నాడట. అప్పుడు వారు అగేరియాజాతీయుల్ని పిలిచి వారిచేత నాలుగు పెద్ద మేకులు చేయించి చపాటీమాదిరిగావున్న భూమికి నాలుగుదిక్కులా నాలుగు మేకులు కొట్టినారట. అప్పటినుంచి భూమి ఒడుదొడుకులు లేకుండా వుందట. అందుచేత బెయిగా జాతీయులు నేటికికూడా భూమి కంపించినప్పుడు దాని కంపనం తగ్గడానికి భూమిలోకి మేకులు కొడతారు.

అసంతృప్తి ఆనందం

[కథానిక]

'సన్యాసులు గుడిముందు ఓంకారధ్వనితో ప్రాణాహుతులు పుచ్చుకుంటూవుంటే ఏనాది చిన్నది గుడివెనక హాహారావంతో అన్నపూర్ణాదేవియొక్క విజీర్ణపత్రాల క్రింద మృతిం వారింది.'

రచయిత:

కవికొండల వెంకటరావు, బి. ఎల్.

రస్తా వెడల్పిచ్చింది. తుడిచే వాళ్లు సంఖ్యలో ఎక్కువైనారు. రస్తారాటు హెచ్చైంది. తుడిచే వాళ్లు క్రొత్తగా దిగుమతి అయినారు. అయితే లోకంలో అసంతృప్తి! అది అలాగేవుంది. నడిచే వాళ్లు తుడిచేవాళ్ళతోను, తుడిచే వాళ్లు నడిచేవాళ్ళతోను ఎంతకలిసి పోతూవున్నా ఆదిసమస్య ఆది సమస్యగానే నిల్చివుంది.

ఆదిసమస్య అనగా ఆకలి సమస్య— 'శిశువు కేరుమనడంతోనే తల్లి అక్కునచేర్చుకు పాలు అందిచ్చేటట్టు అందఱియొక్క అందుబాటులోను భగవంతు 'డున్నాడు! ఉన్నాడు!' అని ప్రతి మతము ప్రతి మార్గదర్శి ప్రకాశమానంగా పలుకడమేగాని పరీక్షయిచ్చిన వాడు వొక్కడూ లేడు. మనందఱకూ వున్నా వాళ్ళకు లేదు. వాళ్ళకు భగవంతుడూ లేడు, భగవద్ప్రవక్తా లేడు. ఆ యుభయం లేమి తోపాటు ఇహభయంలేదు పరభయం లేదు. కాని అహంజ్యోతి! అది ఎవనిలో వానికే ఆ గుంపులో ఆ యుదయం తొణికిసలాడి పోతూ వుంది. ఈ తుడిచేది తాను ఈ నడిచేది తాను అనే యేర్పాటు వేయి మందిలో వేయి ఆత్మలుగా విజృంభించి ఇసుక రేణువుల ఆధారాన్ని పరమాణువులై పైకి లేచిపోవడం నూతనభానూదయకాంతిలో విశదపడుతూవుంది.

* * *

'ఏనాది సిన్నిదాన్ని!
ఏటిమీద ఎనిమిదేండ్లు
పాటిమీద పాతికేండ్లు
పండబెడితె పచ్చగుంట
నిండబెడితె నీటుగుంట
కొప్పునిండ పూలుతురిమి
కొలువ గలనురా!
నిప్పుమధ్య నీతి మొలక
నిలపగలనురా!
చేరమాడి పోకురా
దూరమడిగి రాకురా
సొప్పుకో నా పేరు!
తప్పుకు పొయ్యేరు
ఎల్లాంటయ్యోరు
తెల్లటి దొరగారు.'

అని యొక చిన్నది పాడుతూ చీపురుతో రస్తా తుడుస్తూ చీపురు దుమ్ము—నడుస్తూ వస్తూ ఉన్న ఒకానొక జాతివాని ఛాతీమీదకు—చేటతో ఎత్తిపోసినట్లు పోసింది. ఆ జాతిదొర టోపీతీసుకు ముఖాన్ని చాటెట్టుకు తనను తప్పుకు పొయ్యేటట్లు చేసింది. అతి వొయ్యారంగా తన యీడుజోడు తుడుపుడుగాని కేసి చూసింది.

వాడు— ఆయీడు జోడు తుడుపుడుగాడు— ఆ సమయాన కేదో తన పాట యిలా పాడుతూ వూడుస్తూన్నాడు, పైదాని కేసి చూస్తూనే దాన్ని వింటూనే—

'కోరలమ్మకున్న మహిమ
పీరులమ్మ కున్నదే?
హోరువానకున్న మెఱుము
వొఱుపుబుగ్గ కున్నదే?
బొమ్మలాటకున్న వెలుగు
సెమ్మఆట కున్నదే?
అమ్మకైపు కున్న తెలివి
జిమ్మకైత కున్నదే?'

అని పాడుతూ ఊడుస్తూ- తన దిశగా వస్తూవున్న ఓ సాహెబ్ గడ్డంలో చిక్కుపడేటట్టు- తట్టెడు చెత్త దారినడాన్ని జారపోశాడు. సాహేబు ఆ చెత్త నొక్క దాటు దాటి వాణ్ణే తప్పుకుపోయాడు. గడ్డంసాహేబు గంతు చూచి పక్కుననవ్వింది పిల్ల. మగవాడు ఈలవేశాడు. చిన్నది చిరునవ్వు నవ్వుతూ యీలగాని దగ్గరకువచ్చి యిలా ప్రస్తావించింది.

'పాలకేమి సత్తువుంది ?
నీళ్ళకుందిరా! — పేడ
నీళ్ళకుందిరా!...
పూలకేమి సత్తువుంది ?
రాలకుందిరా! — ప్రేలు
రాలకుందిరా! ...
ఈలకేమి సత్తువుంది ?
గాలికుందిరా !— ఈసు
గాలికుందిరా!...

* * *

ఆ ప్రస్తావన పరిసమాప్తి కాకుండానే వాళ్ళిద్దర్నీ- ఆమాత్రం దూరాన్నుంచి- మోటార్ కారు ముందుసీటున కూర్చుని కమీషనర్ కనిపెట్టి——'తిండికి లేదంటూనే- అన్యోన్యం పరాసికాలాడుకుంటారు!- నీళ్ళను తత్క్షణం నవుకరీలోంచి తీసెయ్యండి' అని వెనక సీటులో కూర్చున్న ఆరోగ్యశాఖాధికారికి సలహాయిచ్చాడు.

ఆరోగ్యశాఖాధికారి 'చిత్తం! వీళ్లు, వాళ్ళల్లోవాళ్లు చేసికొనే చిలిపిచేష్టల్తోనే కాకుండా, హడ్సన్ దొరగారిమీంద దుమ్మపోసి, ఇమామ్‌సాహేబుగారిముందు చెత్త విదిపి అతి రౌడీలుగా ప్రవర్తిందారట నేటియుదయం.' అని మతికొన్ని నేరాలు గుదిగుచ్చాడు.

కమీషనర్ తత్క్షణం ఆఏనాది జోడు కాడ తనకారు ఆపి 'ఓసి! పిల్లా! నిన్నే! నీవు! ఇలారా! నిన్ను పనిచెయ్యడానికి పెట్టినామా ? ఇక్కడ నీ మగాడితోకూడి కన్ను గిలపడానికి పెట్టినామా?' అని అడిగాడు.

ఏనాది యువకుడు ఆరోగ్యశాఖాధికారికి నమస్కారము పెడుతూ బొంగువంపు అయిపోయినాడు.

చిన్నది ఏమన్నా తనచేతి చీపురక్కడ పడేసి 'వాడుచేస్తే చేసేను గాక యీచిల్లరసేవ- నేను చేయలేను! వాడు వంగితె వంగేనుగాక! నేను వంగలేను. నేను వందనం సేయలేను!' అని అంటూ ఓపాట వాళ్ళందఱిమీందకూ విసిరింది. ఓపాట తనలో ముసురుకునేటట్టు చేసికొంది. ఎన్నిపాటలైనా చరణాలన్నే! పది!

'జారుపయట సర్దుకోను
జరుగుతుంటెగా ?
పీడు జుత్తువేసికోను
ప్రేళ్ళుపోతె గాక?—
చేత చీపురట్టియూడ్వ
మూలికి దుమ్ము
కుళ్ళు చెత్త యెత్తియూడ్వ
ముక్కుకు కంపు—
మనిషికసలు పుట్టినాన ?
ఘనసన్నది ఉన్నదేక ?

అని గొంతెత్తి, గొంతుమార్చి, గొంతుదాచి- ఆగుంపును, ఆగోవాళ్ళను, ఆగోష్టిని, విడిచిపెట్టి ఇరవై గజాలు ఉత్తరపు తెఱపినే గస్తు నడక నడచింది.

* * *

అంతలో ఆమెకు వినిపించింది ఒకానొక రంగురంగుల బండి తన వైపునకు వస్తూవున్న చిరుగంటల యులివు. కనిపించాడు బండిలో కూడా ఓసన్యాసి.

నమస్కరించింది ఏనాదిచిన్నది ఆసన్యాసికి. సన్యాసి నమస్కారమందుకుంటూ 'నీ కేంపడవేయాలని వుందో పడవెయ్యి ఈ డబ్బీలో' అన్నాడు.

చిన్నది 'పడవేత ! పడవఏల!' అని వెకిలిగా నవ్వింది. ఆనవ్వుకు హడలిపోయి ఆ సన్యాసి ఆమెనుండి ఓరసిల్లి వంకరగా బండి నడుపుకు పోయేడు. వెంటపడింది. ఎన్ని వంకర లా బండి తిరిగిపోతూ ఉంటే అన్ని వంకరలు తానుకూడా తిరిగిపోతూ అన్నివంకరలూ తన పాటకు చేకూరుస్తూ యీలా పాడదొడగింది.

'కొరుసలువు రాయిజెచ్చి
కన్ను చెక్కి పన్ను జెక్కి
వెన్ను చెక్కి చెన్ను జెక్కి
అన్నపూర్ణ అంచు దాని
నాదరింతురా ?

కన్నుకలిగి పన్నుకలిగి
వెన్నుకలిగి కొన్నుకలిగి
నలుగచే నాణెమునయి
మ్రోగుచున్న నన్ను చూచి
యొత్తిగిలేరా ?

* * *

కూడాకూడా తిరిగింది కావడం చేత నాడాసన్యాసికికూడు ఎక్కడెక్కడ ఏలావేలా ఎంతెంత దొరికిందో కనిపెట్టకలిగింది.

ఇక గుడి అక్కడకు ఫర్లాంగు మేరలోవుంది, ఎదూరుగా కొండమీద. వందమందికి పైగా 'అన్నపూర్ణ సన్యాసులు' కడపరాల పఱపులెక్కి అన్నంబండికోసం నిరీక్షిస్తూ ఉన్నారు. ఆ నిరీక్షణలోనే జేగంటమోగిస్తున్నారు. జతగుంజలు వాయిస్తున్నారు. 'మాతా! అన్నపూర్ణభవానీ!' అని హారతి వెలిగిస్తున్నారు.

బండి అంతకంతకు త్వరగా నడుస్తూ వుంది గుడివంకకు. బండితోనే సన్యాసి వెనక ముందులు చూడకుండా ఎద్దు ముక్కుతాడు ఘూడిస్తూ గ్రుడ్లనిప్పులు గురియిస్తున్నాడు.

ఏనాది చిన్నదాని కర్థంకావడంలేదు ఆదృశ్యం అంతా—దాని కర్థం అవుతూవున్నదల్లా సొంత కాలిమంట, సొంత కడుపుకాల్పు. మా అమ్మా ! మాడపట్టు మట్టమధ్యాహ్నమైయుంది.

* * *

గుడి అరుగులమీదను, గుడి ముందరి నంది యిరుచాయలను, నంది యీవలి ధ్వజస్తంభపు పొడుగు నీడను విస్తళ్ళువేసి, విస్తళ్ళల్లో షడ్రసోపేతంగా పదార్థాలు వడ్డించేస్తూ వున్నారు! కూర్చున్నారు కొదువలేకుండా ముదుసలి సన్యాసులు, కోదమసన్యాసులు, ప్రధమ సన్యాసులు, అధమ సన్యాసులు—కావి జోలె తగిలించుకున్న ప్రతీ ప్రాణికీ ఉంది ప్రవేశం ఆ ప్రాంగణంలోకి— ఇతరులకు లేదు.

ఇతరుల కది రహదారి కాదుఅని అతి నాగరీకంగా అతి నేవళీకంగా త్రోవనున్న ఓ తాటిచెట్టుమీద చెక్కబడివుంది, చేవలోకంటా.

మఱెన్నీ నిరక్షరకుక్షుల కొరకా అన్నట్లు రెండు వేటకుక్కలు ఆచెట్టునే కట్టివేయబడి కనిపిస్తూ వున్నాయి; ఎవరైనానాసరే అప్పటికప్పుడు కరవడానికి విడువబడే మహా స్వేచ్ఛ పుచ్ఛ వక్రతను వెల్లడిస్తున్నాయి కూడాను అవి.

ఆదాకా బోధ పడని దృశ్యము భయానకమైపోయింది ఏనాదిదానికి. 'అది రహదారి కాకపోతే ఏది తనకు రహదారి?' అనే ప్రశ్న ఆవరించివేస్తూవుంది ఆమెను. ఆ ప్రశ్న ఆవరిస్తూన్నకొద్దీ ఆమెకు తల తిరిగిపోసాగింది. తల తిరిగిపోతూవుంది అన్నసంగతి ఒకరితో వెంటనే వెళ్ళబోసికోవాలని వున్నా వినేవారేరీ!

'గుడి వెనక్కుపోయి ఉండు.' మన్నట్టు ఏదో సంజ్ఞ కనిపించింది. 'బండెడన్నము తోలుకువచ్చి యింతమందికి కడుపునిండ బెడుతూన్నవాడు ఆ జగన్నాధుడు తన్ను మఱచిపోతాడా ? నాయనా ! నీ బండికూడా వచ్చినందు కేదో సంజ్ఞ చేసినావే?' అని గుడికి దూరదూరంగా నడుస్తూ గుడియొక్క వెనుకభాగానికి చేరుకుంది చిన్నది, ఆ వెఱ్ఱిది.

అక్కడ, కొండ ఎత్తుగా ఎగురుతూవున్న ఉదధి లోతుగా అణగారుతూవున్న, ఉడుకుతో అదురుతూవున్నా కుదురుతో ఐక్యమౌతూవున్న, ఎండాకులు, ఏనాటి ఆకులో గలగలమంటూ వున్నాయి. పైనున్న ఏచెట్టయినా రాల్చిన కారాకులేమో అని నీడ ఆశను పైకిచూచింది. కాని పిల్లకే చెట్టూ ఆ ఆకులమీదను కనుపించలేదు. కనిపించలేదు సరికదా ఆశకొద్దీ వేసిన అడుగు ఆకుల్లోకి దించుకుపోయి ఆనురదృష్టవంతురాలి నలా ఓ పెద్ద కనబడని గోతిలోనికి దించివేసింది.

దించివేయక దిద్దితీరుస్తుందా ? అదొక పాడునుయ్యి. నుయ్యిఎండిపోయినా మహామత్స్యాలకింకా నెలవు అనేవాడుక. నూతి అడుక్కి వెళ్ళిపోయింది ఏనాదిచిన్నది. వింటున్నారా? కథ !

* * *

...సన్యాసులు గుడిముందు

ఓంకారధ్వనితో ప్రాణాహుతులు పుచ్చుకుంటూవుంటే ఏనాది చిన్నది గుడివెనుక హాహారావంతో అన్నపూర్ణాదేవియొక్క విజీర్ణ పత్రాల క్రింద మృతవారింది. కేవలం దేవి విజీర్ణపత్రాలేఅయితే అంతచేటు చేటువాటిల్లేది కాదేమో! ఆ ఆకులు మనుష్యసన్యాసుల నికృష్టోచ్ఛిష్టప్రేతాలు... ఈజీవి పడగానే ఆ ప్రేతాల్లోంచో ఆ ప్రాతనూతిలోంచో ఓ చెకుముకి రారాయిడి చెణుకు ఆవిర్భవించి వెంటనే ప్రచండాగ్నిజ్వాల నెత్తించింది. ఏదీ గుడి? ఏరీ సన్యాసులు! అన్నంతలో తగులడి పోయినారు!

ఎవరు అన్నంతలో! ఏనాది కోడెకాదు అన్నంతలో? ఏమని అన్నంతలో! 'ఏదీగుడి! ఏరీసన్యాసులు?' అని అన్నంతలో, అయినప్పటికిన్నీ ఆజ్వాల నింకా బయలు మీద కుసికోలుపుతూనే వున్నాడు వాడు. 'ఒరేయి! ఇదేంపనిరా! నీ భార్య యెక్కడుందిరా?' అని ఎవరైనా పరామర్శిస్తే

'పాటిమీద ఏరుతీస్తే
పడవకేమి లోటయా!
పాతికలో ఎనిమిదో తె
పదిహేడే కాదయా!

ఎక్కడో వోదిక్కున కాపడుతుంది.' అంటూ కృతి కపశ్రుతి నివారించేడు.

కుష్ఠరోగంలో ఆవుపాల వాడకం

డాక్టరు సాంత్ర కుష్ఠువైద్యములో ప్రవీణుడు. ఆయన యభిప్రాయము ప్రమాణమైనది. అందుచే అయ్యది మన్నింపదగును. 15 ఏండ్ల నాడు డాక్టరు సాంత్ర గ్రామములలో త్రిమ్మరి మాజిక్ లాంతరుతో కుష్ఠరోగమునిూద మాటలాడుచు కుష్ఠునకును, పాలకునుగల సంబంధము తెలిపి గోరక్షణను గురించి నొక్కివక్కాణించెను. దేవతగా భావించెడి గోవుమ నిర్లక్ష్యముచేసి, నిరాదరణసేయుటచే దైవము మనలను యీ కుష్ఠుజాడ్యముతో శిక్షించెనని చెప్పెను. అది భావోద్రేకముగా, లేక మతోన్మాదముగా కన్పడవచ్చును. గోరక్షణచే కుష్ఠురాదనినే ఋజువు చేయజాలను. కాని పాల వాడకంవలన కుష్ఠుతీవ్రత తగ్గునని సూచనలు కలవు. గతశతాబ్దములో అమృతసర్ జిల్లాలోని సితాలిని పట్టణములో సిక్కుబాబా కుష్ఠరోగనివారకుడని పేరొందెను. ఆ ప్రఖ్యాతి సర్కారుకు తెలిసి విచారణచేయించిరి. అమృతసర్ సర్కారువైద్యుడు వెళ్లిచూచి ఆ నివారణ నిజమేనని తెల్పెను దానికికారణము రహస్యపు చట్కాలుగాక అక్కడకువచ్చిన రోగులకు హెచ్చుగా ఆహారములో పాలువాడుటయే యని ఆయన కనిపెట్టెను.

భారతదేశములో కుష్ఠరోగనివారణ ప్రచార ప్రారంభకుడైన డాక్టర్ మూయర్ ప్రతికుష్ఠురోగి రోజుకి 2 శేర్లపాలు త్రాగవలెనని, అవి ఆవుపాలుగా నుండవలెనని తెలిపెను.

దక్షిణభారతములోని డాక్టరు రోక్రేను కనిపెట్టినదేమన తీవ్రకుష్ఠురోగముగల పిల్లలకు క్రొవ్వులేని పాలు వాడినపుడు జాడ్యపుతీవ్రత తగ్గునని. విదేశములనుండి తెప్పించిన పాలపొడికన్న ఇచ్చట దొరకిన పాలనే ఆయన వాడిన పక్షమున బాగుండెడిది.

ఏ విటమిన్ వలన కుష్ఠురోగులకు మేలు కలుగునని చెప్పబడెను. ఆవుపాలలో ఈ విటమిన్ ఏ హెచ్చుగానున్నది. పచ్చిగడ్డి మేయు ఆవుపాలలో మిక్కిలి హెచ్చు. కావున శాస్త్రరీత్యా ఋజువు ఇచ్చట దొరకుచున్నది. రోగతీవ్రత తగ్గినపుడు అది వ్యాపింపనేరదు. ఈనాడు గోవులకంటెకూడ కుష్ఠులను నిర్లక్ష్యము చేయుచున్నాము. గోవులవలె కుష్ఠులు నోరులేని వారుకారు. అయినను వారి మొరను వినిపించుకొనకున్నారు. భారతసభ్యతలో గోరక్షణవలనే కుష్ఠురోగి రక్షణకూడ ఒక అంతర్భాగము. ఇపుడుకూడ దేవఘర్ - జగన్నాథ దేవాలయములలో ధర్మకర్తలే కుష్ఠులకు అన్నమిడుచున్నారు. దక్షిణాదిలో దేవాలయాధికారులు యిట్లే చేయుచున్నారు. దేవాలయములవద్ద వీరి నివాసమునకు స్థలమిచ్చిరి. మనువుకాలమునుండి యిట్టి ఆచారము ఏర్పడియుండును. కుష్ఠులు స్వగృహములవీడి పుణ్యక్షేత్రములలో నివసించవలెనని మనువు సలహా చెప్పెను. సేవాగ్రామ శాస్త్రిగారిని కలసి మన శాస్త్రములలో కుష్ఠును గురించి వ్రాసిన వ్రాతలను పరిశోధించమంటిని. నేడు మనసభ్యత క్షీణించెనుగాని మరణించలేదు. దానిని పునరుద్ధరించిన కొలది గోరక్షణ పెరుగును. కుష్ఠురోగము తిరుగును. మనజాతీయాభివృద్ధి విధాన నిర్ణయ కార్యక్రమములో ఈ రెంటికిని అవకాశ మేర్పరుప వలయును.

—గాంధి.

(గాంధిసందేశము)

అడవి ఉసిరి అధిక్యత

శాకాల్లోను, ఫలాల్లోను బలాన్ని, వృద్ధిని ఇచ్చే ద్రవ్యాన్ని విటమిన్ సి అంటారు. ఈ విటమిను ముఖ్యంగా ఆకు కూరలలో ఎక్కువగా ఉంటుంది.

ఈ విటమిను దేహంలో తక్కువై తే సే, జబ్బులు వస్తాయంటారు. సి విటమినుగల పదార్థాలు నెక్కువగ తినమని డాక్టరు సామాన్యంగా హెచ్చరిస్తూ ఉంటారు.

శనగ, పెసర, కంది, గోధుమ మొదలగు వానిలో సి విటమినులేదు. అయినా వీనిని నీళ్ళలో నానవేసి, మొలకలెత్తేటట్టు చేస్తే సి విటమిను ఉత్పత్తి అగుతుంది.

అన్ని ఫలాల్లోకి పెద్ద ఉసరికాయ సీ విటమినుకి ప్రాధాన్యం వహించింది. ఉసరిక చెట్లు సామాన్యంగా అడవులలో ఎక్కువగా పెరుగుతాయి. ముఖ్యంగా జనవరి ఏప్రెలు నెలలమధ్య వీనికాపు అధికం.

నారింజలోకంటె ఉసిరికలో ఇరువదిరెట్లు సి విటమిను ఉన్నట్లు వైజ్ఞానికులు కనుపెట్టారు. ఒక్క ఉసరికాయతింటే, ఒకటి రెండు నారింజపండ్లు తిన్న దాని కంటె ఎక్కువ ప్రయోజనము.

దీనిని సంస్కృతంలో అమ్లమంటారు- ఆయుర్వేదవైద్యులుకూడా అమ్లంయొక్క గుణాల నెక్కువగా ప్రశంసించారు.

దీనిలో విశేషమేమిటంటే, తక్కువ పండ్లనలె, ఎండిపోయినా, ఊరవేసినా, దీనిలో సి విటమిను తగ్గదట. వుసరికను ముక్కలుగకోసి ఎండపెట్టి వరుగుచేయడం మనం ఎరుగుదుము. వుప్పులో ఊరవేసి ఊరగాయ చేయడంకూడా మనం ఎరుగుదుము. పచ్చికాయలో సి విటమిను ఎంత వుంటుందో, అంతా ఎండినా, ఊరినా వుంటుందట—అదీ గొప్పవిశేషం.

ఇప్పుడు వుసిరికాయ రసంతో విటమిను సి టేబ్లెట్సును తయారుచేస్తున్నారట. సి. విటమిను లోపంగా వుంటే వారు వీనిని సేవిస్తే, తిరిగి ఆరోగ్యం కలుగుతుందని ఇంగ్లీషు డాక్టర్లుకూడా అనుభవంవల్ల చెప్పుతున్నారు.

ఆయుర్వేద వైద్యులేకాకుండా,యూనానీవైద్యులుకూడా వుసిరిక మహత్తును కనిపెట్టారు- వుసిరిక మరబ్బా వారిచ్చే టానిక్కులలో ఒకటి. ఢిల్లీహకీములు వుసిరిక మరబ్బాను చాలా ప్రశస్తంగా తయారు చేస్తారట.

—కృష్ణాపత్రిక.

జలాంతర్గాముల్లో జీవితం

కొన్ని వారాలపాటు సూర్యరశ్మికూడా కనిపించదు—
జలాంతర్గాముల్లో చిరకాలంవుంటే ఆకలి నశిస్తుంది—
జలాంతర్గాముల్లో పనిచేసేవారికి అన్నహితవు చెడుతుంది—
అందులో పగటిపూట చద్దిఅన్నం, రాత్రి వెచ్చటిఅన్నం—
యంత్రాలగిదిలో పనిచేసేవారు వున్నివసనాలు కట్టుకుంటారు—

ఈ రోజుల్లో జలాంతర్గాముల విషయం ప్రతివారికీ కర్ణతాడిత మవుతూవుంది.

అవి చేసే దౌష్ట్యం తెలుసుకుంటే ఎట్టివారికైనా గుండె జలదరించక మానదు.

అట్టి గుండె జలదరింపుకు హేతుభూతమైన జలాంతర్గాముల్లో జీవితం ఎట్లావుంటుందో తెలుసుకోడానికి ప్రతివారికీ కుతూహలంగా వుండడంసహజం.

ప్రతి జలాంతర్గామిలోను దాని ప్రయాణానికి పూర్వం ఆహారపదార్థాలు పుష్కలంగా ఏర్చి కూరుస్తారు. అవి పలువారాలకి సరిపోయేటట్లుగా జాగ్రత్తపడతారు.

జలాంతర్గామి ఒకటి సముద్రయానం ప్రారంభంచేసేటప్పుడు జరిగిన సంఘటనను హెచ్. సి. ఫెర్రాబీ ఇట్లా వర్ణిస్తున్నాడు:

'జలాంతర్గామిడిపోఓడ టాపుమీద నిలబడివున్నాను. ఒక జలాంతర్గామి సముద్రయానానికి పోవడానికి సిద్ధంగావుంది. దిడ్డిగంతల్లోంచి ఆ జలాంతర్గామి ఉద్యోగులు లోపలికి దిగిపోవజొచ్చారు. అందులో ఒకడు నాతో ఇట్లా అన్నాడు: గతసారి నేను సముద్రయానం సాగించినప్పుడు కొన్ని వారాలపాటు సూర్యరశ్మి ఎట్లావుంటుందో చూడలేదు. జలాంతర్గాముల్లో పనిచేసేవారు పలువురిస్థితి ప్రాయకంగా ఇట్టిదిగానేవుంటుంది. జలాంతర్గామి సముద్రంపైన తేలిపోయేటప్పుడైనా ఇందులో పనిచేసేవారు లోపల యంత్రపుగదిలో వుండవలసివుండడంచేత సూర్యరశ్మి చూడగలిగి వుండరు. నీటిలో మునిగినడుస్తూవుంటే సూర్యరశ్మిఎట్లానూ కనిపించదు.'

జలాంతర్గాముల్లో పనిచేసే వారికి ప్రత్యేకమైన ఆహారం అవసరం. ఆ ఆహారం ఎట్టిదిగా వుండాలో ప్రత్యేకనిపుణుల సంఘం నిర్ణయిస్తుంది.

సూర్యరశ్మి తగలకపోవడంవల్ల మానవశరీరంలో కొన్ని రకాల విటమినులు, రసాయనిక పదార్థాలు లోపిస్తాయి. తినే ఆహారపదార్థాలవల్ల ఆలోపం తొలగించాలి.

ఇంతేకాదు. జలాంతర్గముల్లో పనిచేస్తూ దినాలవెంబడి నీటిలో మునిగివుండేవారికి ఆకలి చచ్చిపోయి నోటిలో అరుచి బయలుదేరుతుంది. కాబట్టి వారికి ఇచ్చే ఆహారం ఆకల్ని పుట్టించేదిగా, అరుచిని పోగొట్టేదిగా వుండాలి.

మామూలు ఓడల్లోనివారు మధ్యాహ్నం వెచ్చటి భోజనం, సాయంకాలం చల్లారినభోజనం చేస్తారు. జలాంతర్గముల్లోని వారి భోజనం ఇందుకు పూర్తిగా వ్యతిరేకంగా వుంటుంది.

ఈ స్థితికి ఒక కారణంవుంది.

జలాంతర్గామి పగలు సాధారణంగా నీటిలో మునిగేవుంటుంది. అప్పుడు దానికి కావలసినగాలి అంతా అందలి స్టోరునుంచి సరఫరా అవుతుంది. వంటవల్ల ఎంతో గాలి ఖర్చు అవుతుంది. కాగా నీటిలో మునిగివున్న స్థితిలో అనగా పగటిపూట జలాంతర్గామిమీద వంట వుండదు,

సాయంకాలంఐనపిమ్మట కప్తాను అనుమతితో జలాంతర్గామి నీటిపైకివచ్చి దిడ్డిగంతలు తెఱుచుకుంటూ గాలిపోసుకుంటుంది. అప్పుడు వంటకు ఆజ్ఞ అవుతుంది. అందుచేత జలాంతర్గాములలోని

వారు మధ్యాహ్నం చద్దిభోజనం చేస్తూ రాత్రిళ్లు వెచ్చటి అన్నం తింటారు.

వారాలుగా పనికివచ్చే ఆహార పదార్థాలను కూడినంత తక్కువ స్థలంలో రెప్పపాటులో చేతికి అందేటట్లుగా అమర్చి వుంచడం ప్రత్యేకంగా ఒక కళ. ఏనాటి వంటకాలు ఏవో జలాంతర్గామి ప్రయాణానికి ముందుగానే నిర్ణీతమై ఆయానిర్ణయానికి అనువు పడేటట్లుగా అవి నిలవచేయబడతాయి.

జలాంతర్గామిలోని జీవితంలో మరి కొన్నివింతలుకూడా వున్నాయి. యంత్రాలగదిలో పనిచేసేవారు దళసరి ఓవరుకోట్లు తొడుక్కొని ఉన్ని వసనాలు కప్పుకుంటారు. ఈ బట్టల అన్నిటికిందా బహుశా స్వెట్టరుకూడా వుంటుంది.

ఎంజన్ రూములో చాలా వేడిగా వుంటుందిగదా, ఈవసనాల ధారణమేమిటని పలువురికి వింతగా వుండవచ్చు. జలాంతర్గామి నీటిపైన తేలుతూ దిడ్డిగంతలు (Hatches) తెరుచుకుని పోయేటప్పుడు దాని యంత్రపుగదిలో ఇవతాళించే చలిగాలి కొడుతూ వుంటుంది.

ప్రతి జలాంతర్గామికి రెండు రకాల ఇంజన్‌లు వుంటాయి. జలాంతర్గామి నీటిపైన వున్నప్పుడు పనిచేసేవి డీసిల్ ఇంజనులు. జలాంతర్గామి నీటిలో మునిగివున్నప్పుడు పనిచేసేవి ఎలక్ట్రిక్ ఇంజనులు. డీసిల్ ఇంజనులు నడవడానికి గాలి కావాలి. ఎలక్ట్రిక్ ఇంజనులు నడవడానికి గాలి అక్కర లేదు. అందుచేతనే డీసిల్ ఇంజనులు నీటిమీద, ఎలక్ట్రిక్ ఇంజనులు నీటిలోను పనిచేస్తాయి.

డీసిల్ ఇంజనుల నూనెతొట్టిలో నిండా నూనె పోస్తే జలాంతర్గామి ఏకబిగిని పన్నెండువందల మైళ్లు ప్రయాణంచేస్తుంది. నీటిలో మునిగివున్నప్పుడు జలాంతర్గామి యంత్రాల్ని నడిపే ఎలక్ట్రిక్ యంత్రాలు కొద్ది గంటలకే తిరిగి కొత్త విద్యుత్తును కోరుతాయి.

కొన్ని రకాల జలాంతర్గముల లోని ఎలక్ట్రిక్ యంత్రాలు గంటకు ఎనిమిదినాట్ల చొప్పున వెళ్ళే ప్రయాణానికి నాలుగుగంటల కాలంమాత్రం పనిచేస్తాయి. అందు

చేత జలాంతర్గామి నీటిలో వున్నంతసేపు కప్తాన్ దానివేగాన్ని బాగా కుంచించడానికి ప్రయత్నిస్తాడు. ఎలక్ట్రిక్ బాటరీలు త్వరగా సెలవైపోకుండడానికి గైకొనబడే మెలకువ ఇది. ఆ బాటరీలు ఖాలీ అయ్యాయంటే ఆ జలాంతర్గామి నీటిమీదకు రాక తప్పదు. జలాంతర్గామి పైకి రావడంతోటే పనివాళ్లు ఎలక్ట్రిక్ మోటార్లను డైనమోలుగా మార్చి డీసిల్ ఇంజన్‌ల సాయంతో బాటరీలను తిరిగి విద్యుచ్ఛక్తితో నింపుతారు.

నీటిపైన వున్నప్పుడు ఎలక్ట్రిక్ యంత్రాలు పనిచేస్తూ వుండగా ఒక విధమైనధ్వని బయలుదేరుతుంది. ఆ ధ్వనివల్ల జలాంతర్గామి వునికి శత్రువులకు తెలిసిపోవచ్చు. కాబట్టి ఇట్టి తరుణాల్లో జలాంతర్గామి మిక్కిలి మెలుకువతో వుండాలి.

రేవు పట్టణాన్ని వదలి సముద్రంమీదా, సముద్రంలోనూ జలాంతర్గామి ఒక బిగిని 110 రోజులు వుండగలదు.

జలాంతర్గాముల్లో పనిచేసేవారు మిక్కిలి చురుకైనవారై వుండాలి. ఏదేనా మరామ్మతు వస్తే అది నిమిషాలమీద జరగాలి. ఒక్కొక్కప్పుడు ఒక రెప్పపాటు ఆలస్యం జలాంతర్గామి జీవితానికి గండాన్ని కలిగించవచ్చు. జలాంతర్గాముల్లో పనిచేసేవారు అనేకరకాలపనుల్లో చేయితిరిగినవారై వుండాలి.

విజ్ఞాన విషయాలు :

కప్పకాళ్లనితినే ఫ్రెంచి జాతీయులు

ఫ్రెంచి జాతీయులు కప్పల్ని తింటారు. మనం వంకాయ ముచికల్ని ఎంత ఆప్యాయంగా తింటామో వారు కప్పకాళ్ళని అంత కమ్మగా తింటారు.

* * *

ఇంగ్లండులో ట్రాముబళ్ళని పురుషులకలె స్త్రీలున్నూ నడుపుతున్నారు. ఆ స్త్రీలు పురుషులు పనిచేసేటంతటికాలమూ పనిచేస్తున్నారు. సమాన పరిస్థితులలో పని- సమానమైన జీతాలు. కాగా పురుషులకు స్త్రీలు లోచ్చుఅని ఎట్లా చెప్పగలము ?

* * *

ఇంగ్లీషు చరిత్రకు తెలిసిన మొదటి లాటరీ 1569 లో సెయింట్ పాల్సు కథీడ్రల్ పశ్చిమద్వారంవద్ద జరిగింది.

* * *

1654 లో ఆలివర్ క్రామ్‌వెల్ ఇంగ్లండులో కోడిపందాల్ని నిషేధించాడు.

* * *

లండన్‌లో మొదటి డైరక్టరీ 1677 లో ముద్రితమైంది. అందులో 1790 పేళ్లు మాత్రమే పేర్కొనబడ్డాయి.

* * *

మూడవ హెన్రీ ఇంగ్లండును పాలిస్తూ వుండగా ఫ్రాన్సురాజు అతనికి ఒక ఏనుగును బహుమానం చేశాడు. అది చాలా పెద్దది. ఇంగ్లండు మట్టిమీద మసిలిన ఏనుగులలో అదే మొదటిదని చెప్పబడుతూవుంది.

* * *

కోళ్లు, జింకలు, దుప్పులు మున్నగు జంతువులతోసమైన పార్కులు ఇంగ్లండులో 334 వున్నాయి.

* * *

లండన్‌లో 1750 లో కలిగిన భూకంపం ప్రజల్ని చాలా కల్లోలపరిచింది.

* * *

ఆంబోతులు, ఎద్దులు వేనినైనా వెన్నంటి తరిమితే మొదటిలోనే తలవంచవు. పరుగెత్తినంతసేపూ తలఎత్తి పెట్టే వుంటాయి. కుమ్మవలసిన వస్తువు అందుబాటుకు వచ్చేతరుణంలో కుమ్మేధోరణిలో తలవంచుతాయి.

* * *

ఇంగ్లండు శీతోష్ణస్థితి పనివాళ్లు సంవత్సరంలో ఎక్కువరోజులు పనిచేయడానికి అనువైనదిగా పరిశోధకులు నిర్ణయించారు. ఈ సౌకర్యం ప్రపంచంలో మరి ఏదేశానికిన్నీ లేదు.

* * *

స్కాట్ అనే పరిశోధకుడు 1912 జనవరి 18 తేదీని దక్షిణధ్రువం చేరాడు.

* * *

ఫిలిప్పయిన్ దీవుల్లో హోమ్‌రూలు 1935 నవంబరు 15 న ప్రారంభమైంది. అధ్యక్షుడు మాన్యుల్ క్వేజన్.

* * *

1923 లో టర్కీ రిపబ్లిక్‌గా మారింది. ఆ రిపబ్లిక్ మొదటి అధ్యక్షుడు ముస్తాఫా కమాల్.

* * *

ఇంగ్లీషువారు సీపిజాతి నత్తగుల్ల చేపల్ని తింటారు.

చదువుకొన్న నిరుద్యోగి

ఈ వ్యాసంలో ఈ నాడు ఈ దేశంలో కనవచ్చే చదువుకొన్న నిరుద్యోగుల స్థితిగతులు కొంతవరకు ప్రదర్శించే ప్రయత్నం జరిగింది. —సంపాదకుడు.

రచయిత:
సాహిత్యవిద్యాప్రవీణ
ములగాల సేతుమాధవస్వామి

'పనిలేని మంగలి పిల్లితల గొరిగాడు' అనే సామెత మనం ఎప్పుడూ వాడుతూ ఉంటాదే. ఉద్యోగాలకోసం చదివి, పరీక్షలు ప్యాసయి, ఊరికే కూర్చొనేవారందరూ ఇదే పద్ధతిలో ఉంటారు సాధారణంగా.

ఈ నిరుద్యోగులబాధ చెప్పడానికి వీల్లేనిది. పరీక్ష ప్యాసయిందగ్గరనుంచి ఉద్యోగంలేక ఊరికే కూర్చోలేని బాధ. పోనీ పదిమందిలోకి వెళ్ళి సరదాగా నాలుగు కోతలుకోసి కాలక్షేపం చేద్దామా అంటే మనకేం ఉద్యోగం లేదు, ఎవరేనా ఏమనా అనుకుంటారేమో అని ఓవిధమైన సిగ్గు.

ఇంట్లో చూద్దామాఅంటే పెళ్లానికి లోకువే, పిల్లలకీ లోకువే అవుతామనే చింత. అయ్యోమాటా నిజమేకూడాను.

పోనీ ఉద్యోగంకోసం ఎవరిచుట్టూనయినా తిరుగుదామా అంటే చెల్లించే మంత్రపుష్పం చెల్లించక తప్పదు. చెల్లించినా దర్శనంకాదు. దర్శనమైనా వాయిదాలు పడతాయి. తర్వాతయినా 'యోగినాంతు తపసాఖిలసిద్ధిః' అనే లెఖ్ఖలో వాళ్ళకొక్కాని ఫలించడ మరుదు.

ఇంక పైవాళ్లు కొంతమంది నోరున్నవాళ్లు అధికారులతో లేనిపోని స్నేహాలు వెల్లడించి మధ్యేమధ్యే పానీయాలతో పొట్టపోసుకుంటూ ఉంటారు.

ఈబాధలన్నీ యెందుకు? చదువుకై అమ్మగా మిగిలిన ఏరెండెకరాల కొండ్రో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబం గడుపుదామంటే గతుకుల్లో నడిస్తేనే మెత్తకాళ్ళడతాయి.

ఇంకిక్వేవీ కుదరక పైన చెప్పిన సామెతకి గురయ్యేవాళ్లే చాలామంది.

ఇట్లని నేనేదో మాటవరసకంటే "స్నిగ్ధజనసంవిభక్తం ఖలుదుఃఖం సహ్యవేదనం భవతి" అని నాసంగతి చెప్తా వినమంటూ ఒక మిత్రుడిలా చెప్పడం మొదలుపెట్టాడు.

పరీక్షలయిన తర్వాత

లాఢీ బేడీ కట్టేసి ఇంటికి వచ్చేసరికి పరీక్షరోజులు రెండ్ణెల్లూ స్టడీమాటెలావున్నా టీ గతప్రాణాలవడంచేత శల్యావశిష్టమైన నా శరీరాన్ని చూసి, రాత్రింబవళ్లు చదవడంచేత చిక్కిపోయాడు కూవాడని అత్యాదరంతో చూశారు మా వాళ్ళభ్యవహారాది విషయాల్లో.

మే నెలరాగానే రిజల్టుహడావిడి. ఈ రోజున మీరిజల్టుపడ్డాయన్నాడో మిత్రుడు. లైబ్రరీకెళ్ళి పేపరు తీద్దునుకదా నానెంబరుదాకా రిజల్టు ప్రకటించి మిగతావి రేపటిపేపర్లో అని వుంది. ప్రతీవాడూ అడగడమే —నీ పరీక్ష ఏమయిందని? ఏంచెప్పను? 'గీతాయనూతం' అయిందేమిట్రా అని ఒకడు.

ఏలాగో వీళ్ళబాధ వదిలించుకొని యింటికొచ్చేసరికి 'ఈవాళ మీపరీక్షలు పేపర్లోపడ్డాయిట.' ఏమయిందండీ?' అంటూ మా ఆవిడ. ఏం చెపుతాడో విందామని వంట ఇంట్లో మాఅమ్మ. అమ్మా బావొచ్చాడే అని మాబావమరిదివెధవ మా ఆవిడతల్లితో చెప్పగానే నిద్రకళ్ళతో చెవులు నిక్కపొడుచుకుని ఓరదిగుమ్మంపక్కని ఆవిడ.

సమాధానం తడువుకోకుండా చెప్పాలి. ప్యాసయ్యానని అబద్ధమాడదామా అంటే మా ఆవిడభ్రాత చూశాడేమో! నిజం చెబుదామా అంటే లేనిపోని అనుమానాలు అని ఆలోచిస్తూ వినీ విన్నట్టుగా గదిలోకి పోయి నవ్యకవులు ప్రసాదించిన ఓ భావగీతి పాడుతూ మంచంమీద చతికిలపడ్డాను. పాడుతున్నానన్న మాటేకాని వాళ్ళపని దోరణిలో వాళ్లున్నా, వాళ్ళేమాటలు చెప్పుకుంటూ ఉన్నా నాగోడవేనేమో అని ఆవేళంతా నాకు మతిలేదు.

రాత్రి తెల్లవార్లూ నామనస్సులో ఎన్నికార్లూ, ఎన్నిరైళ్ళూ పరిగెత్తాయో చెప్పలేను. తెల్లారి బైటికెళ్ళి— ఎప్పుడూలేని ఆలస్యం— రెండుగంటలసేపు కూర్చున్నాను. సరే మొత్తం మీద కాలకృత్యాలవీ తీర్చుకొని ఎల్లాగో రెండు మెతుకులు నోట్లోవేసుకొని మెయిలుదగ్గర కెళ్ళేసరికి మెయిలు వెళ్లి చాలాసేపవడంచేత లైబ్రరీ కెళ్ళిందన్నారు పేపరు. కాళ్ళీడ్చుకుంటూ మళ్ళీ లైబ్రరీదగ్గర కెళ్ళేసరికి ఒకాయన పేపరుచదువుతూ ఇందులో రిజల్ట్సుఏమీ లేవు, నిన్ననే పడ్డాయికదా! అన్నాడు.

అక్కడినుంచే దగ్గరలోనున్న మాపిన తల్లిగారి ఊరెళ్లా వేమీతోచక. అక్కడా యిదేగొడవ. మాపిన్నిగారబ్బాయి, వాడి స్నేహితులూ పరీక్షలు తెలిశాయా అంటూ- సినిమాలూ నాటకాలూ చూడ్డాని కొచ్చినట్టు నాచుట్టూ.మూగారు.

ఏంచెప్పనూ? ఈ సంవత్సరం పరీక్షలు జరుగుతాయా, జరగవా అనే సందేహంలో ఖంగారుగా జరిగాయిఅంటూ, మాసైన్స్ ప్రొఫెసర్ సంగతి, మా తెలుగు పండిట్ సంగతి అవీ, ఇవీ, ఓ లెక్చరుకొట్టి ఎల్లాగోవాళ్ళని తప్పించుకోవడం బ్రహ్మాండమైంది.

ఆ రోజక్కడ గడిపి మర్నాడు ఇంటికి ప్రయాణంపెట్టా. కాలుముందుకి నడవటంలేదు. ఏమీ తోచటంలేదు. అల్లాగే ఆపిచ్చిదోరణిలో ఇంటిదాకా వచ్చాను. ఏదో అనుమానం. మహాపరాధంచేసినవాడిలాగ ఇంట్లో అడుగుపెడుతూనే నాగదిలో దూరికేశాను.

'నిన్న మీరెక్కడి కెళ్ళారూ? పొద్దున్నే పోష్టువా డుత్తరం ఇచ్చాడు.' అని నాదగ్గరకొచ్చి నుంచుంది నా ధర్మపత్ని. ఉత్తరం చదవగానే నాముఖవికాసం చూసి ఏమిటో చెప్పమంది.

ఆ ఇంగ్లీషుత్తరంలోఉన్న తెలుగు అభిప్రాయ మిది: "ప్రియమగు ప్రాణసుహృద్వరా! నేటే మనపరీక్షలు తెలిశాయి. మనయిద్దరం బి. ఏ. సెకండుక్లాసులో ప్యాసయ్యాము. తరచు క్షేమము తెలుపు." అని మా మిత్రుడు వ్రాశాడని చెప్పాను.

ఇది వినగానే మావాళ్ళందరికీ కూడా సంతోషమైంది. నోట్లో మెతుకులునోట్లో ఉండగానే వీధులోకి వచ్చేసరికి ఎవరిమట్టుకు వాళ్లు నీ నెంబరు పేపర్లో పడలేదుట కదూ! అంటూ నన్నడిగేవారు.ఆ బాధ భరించలేక నామిత్రుని ఉత్తరం చదివి రుజావుచేసుకునే సరికి మాతాతలు దిగొచ్చారు.

ఇదంతా నాలుగైదు మాసాలై పాతపడ్డాక ఏం ఎక్కడా కుదరలేదూ. అని మెడమీద తలున్నవాడల్లా అడగటమే. ఏంచెయ్యను పత్రికల్లో 'వాం

మేలుకొలుపు

బూర్గుల రంగనాథరావు

[సాధనసమితి.]

ఎచట నిర్భీతి ధృతితలయెత్తికొనునో ;
ఎచట జ్ఞానంబు దొరకునో ఉచితముగను ;
ఎచట దేశము స్వార్థక్రకచము చేత
వ్రయ్యవ్రయ్యలుగాఁ గోయబడక నుండు ;
ఎచట సత్యంబె ప్రాణము వచనములకు ;
అలస తెరుగని యత్న మనారతంబు
ఎచట పరిపూర్ణతాసిద్ధి కెగురజూచు ;
ఎచట న్యాయవివేకంబు యింకిపోయి
మూఢ సాంప్రదాయాలలో మునిగిపోదో ;
ఎచట నీశక్తి, బుద్ధిని యెపుడుగూడ
విస్తృతించెడి యోచనా వీధిలోకి,
సక్రమంబగు కార్యాలు సానుకూల
మవగ గొనిపోవు...అచ్చటి నవయుగమున
దేవ! మేలుకొనిమ్ము నా దేశజనుల!!

[రవీంద్రుని 'గీంతాంజలి'లోని ప్రార్థనాగీతమునకు అనువాదం.]

టెడ్' అనేది రోజూ చూస్తున్నాను. అందులో నాకు సంబంధించిన వేవీ కాళీలేవు. ఉన్నా ఒకటి రెండు మాట్లు నాలుగులు, ఐదులు రూపాయిలు చెల్లించడమైంది ఎడ్మిషన్ ఫీజంటూ. ఏమీ లాభంలేదు. ఇవేవీ వీళ్ళకి తెలియవు. మానాన్న బతికుంటే నేనెలా తిరిగినా బాధలేకపోను. వచ్చే ఆదాయమూ చాలదు. ఉన్న నిలవ అయిపోయింది. ఏమనుకుంటే ఏంలాభం? ఒకరితో తలెత్తి మాట్లాడకపోవడమే దీనిమందు. అని-

ఇంటిదగ్గర

కూచుంటే తిండీ తిప్పలూ ఎలా ఉన్నా ఏమండోయి! నిద్రా? అంటూ నాగృహిణివచ్చి అమ్మాయి నోమాటు పుచ్చుకోండి. ఊరికే కూర్చొనేటప్పుడు పిల్లనేనా ఎత్తుకోరేం, అంటూ ఓమాటూ పంతులుగారమ్మాయి చూశారా మూడో నెలో నాలుగోనెలో ఎంత బాగుందో అంటూ, మనమ్మాయికంటే అందంగా ఉందా! మనమ్మాయి ఎరుపూ, కనుముక్కుతీరూ, ముఖవికాసం ఇంకెవరికొస్తాయి అని లేని ఉత్సాహం తెచ్చుకొని అనీ అనడంలో, చూడండి వాళ్ళమ్మాయిని తెలుస్తుంది. ఒళ్ళంతా బంగారమే కాళ్ళగజ్జలు, మెళ్ళో బంగారపు గొలుసు. బంగారం మొలతాడు. చేతులికి బంగరపు ఒత్తులు. ఇంకా వాళ్ళమేనత్త ఏవేవో నగలుచేయించి పెడతానందిట. మనమ్మాయికి ఏడాది వెళ్ళినా అణావూసలు తప్పితే మరేమీలేవు. అవైనా మా అమ్మ కొన్నవే అంటూ క్షణక్షణక్షణానికీ ఇలాంటివే చదువుతూ ఉండేది.

మధ్యమధ్య మా అమ్మవచ్చి 'అమ్మాయిని తీసుకువచ్చి అప్పుడే యాడాది కావస్తూంది. ఏముంది నాయనా నాకు నువ్వొక్క మగబిడ్డవూ అదీని. ఏమీ పెట్టలేక పోతున్నా. మీ నాన్న ఉన్నప్పుడు ఇంకా ఏవో పెడదాం, చేదాం అనుకొనేదాన్ని. ఆయన హాఠాత్తుగా పోయారు. ఏముద్దూ ఏముచ్చటా తీరలేదు. ఆడపిల్లకి పుట్టింటిమీదే ఉంటుంది' అంటూ మా అమ్మ విచారంగా ఉంటే నాకూ కళ్ళమ్మట నీళ్లొచ్చేవి.

ఇల్లా కొన్నాళ్ళు గడిచేసరికి బంధువుల్లో ఏమిటి, స్నేహితుల్లో ఏమిటి నన్ను చూసిన వాళ్లందరూ కిలం వదిలితేగాని ఫలందక్కదు పోతే పోతుంది కొంతడబ్బు, చదువుకున్నందుకు ఎల్లాగో ఉద్యోగం సంపాయించాలి అని నా ఊపిరి కెరపకుండా ఊదరకొట్టేసరికి, జై సీతారాం అని ఓ పదిరూపాయిలు జేబులో వేసుకుని ఉద్యోగప్రయత్నానికి బయలుదేరాను.

వెళ్లాను ముందర జిల్లావిద్యాధికారి దగ్గరికి. దర్శనానికి రెండు రోజులు సహించుకున్నా — 'వన్యవసరోప సర్పణీయా రాజానః' అని. దర్శనం అయ్యాక 'ఇప్పుడెక్కడ కాళీలున్నాయయ్యా! అయినా మీ ఉద్యోగాలకి పనికొచ్చే బోర్డు సంబంధం మాకేమీ లేదే' అని నామాట కవసరం లేకుండానే కలవిచ్చేశారు.

అక్కడనుంచి ఇవతలపడేసరికి మీకే పనిమీద ఒచ్చారు; ఏంజరిగింది అంటూ తీర్థప్రజలా మూగారు అక్కణ్ణించి వదిలించుకునిబయటపడ్డదగ్గరనుంచి, ఉద్యోగానికి ఎవరే సలహా చెపితే అదల్లాతూ, చా, తప్పకుండా చేస్తూండటం. ఎక్కడ కాళీఉందంటే అక్కడకల్లా రిజిస్టర్డుపోస్టులో అప్లికేషన్ పంపడం. అవసరమైతే వెళ్ళడం. అక్కడ సలహాఇచ్చినవాళ్లకీ, ఆఫీసుదాకా వచ్చినవాళ్లకీ, ఇంకా వారి మిత్రులకీ తృప్తాస్స్మః అనేవరకూ కూడ ఫలహారములు పెట్టించడం.

ఇవేమి టఖేమిటి ఈ విధంగా ఉండి

ఒక్కసారి వెక్కు కష్టాలు

అనేక కష్టాలు ఒక్కసారి వచ్చినప్పుడు 'గురువులరాక, దాసి మృతి గుర్రపుదాడి...'ఇత్యాది చాటుపద్యం ఒకటి మనవాళ్లు చదువుతూ వుంటారు. ఈ క్రింది చాటుపద్యం కొత్తగా ఉపలబ్ధమైంది. ఇది 'గురువులరాక...' అన్న పద్యంతో తుల్యయోగిత కలది.

ఉ. పందిరిక్రింద మంట, మతి భార్యబహిష్ఠ, కచేరిలో జమా
బంది, చెవిన్ వ్రణంబు, ఘనవర్షము, నల్లునిరాక, వీధిలో
నందరముంగు(గ)గేక లిడు నప్పులకోమటి, చాల కివ్వి, యే
ముందును? దంద్రియాబ్దికము, నా దినమంచె తటస్థమాయె! హా!

పూర్తిచేయగలరా?

ఒంగోలు ప్రాంతమందలి కొన్ని ఊళ్ళపేళ్ళను ఈక్రింది పద్యంలో భారతకథ పరంగా ఒక చాటు కవి కూర్చివున్నాడు. ఇందులో మూడో పాదంలో మొదట కొంత లోపిస్తూ వుంది. ఈ చాటుపద్యాన్ని ఎరిగిన ఒంగోలు ప్రాంతీయులు దానిని పూర్తి చేసి పంపగోరుతున్నాము. ఇందులో కింద గీతగీసివున్నవి ఒంగోలు ప్రాంతపు ఊళ్ళపేళ్ళు.

—సంపాదకుడు.

బంధు కరవది యుద్దను పార్థ వేంద్ర
ద్రుపదపుత్రిని కొప్పోలు నంట నీడ్చె
............రవరవం గొల్లునినియె
పాపి దశరాజు పల్లెత్తి కలుకదయ్యె.

ఉద్యోగప్రయత్నం మానుకొనేసరికి మా బంధుకోటిలోవారికి పల్పపల్పగా రెండు శతాలు ఇవ్వతేలాను.

అప్పుడు బాగా ఆలోచించి 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని వ్యవసాయాది కృషి మొదలుపెట్టాను. మొదట గొడుగు వేసుకువెళ్లే నన్ను చూసి నవ్విన వ్యవసాయదార్లందరికీ అప్పుడప్పుడు నన్నుచూస్తే జాలికలుగుతూఉండేది. ఆదార్ని నడవలేను. నడిచినా ఏముల్లయినా గుచ్చుకుంటే నాలుగురోజులవరకు మళ్లీ కదలుటలేదు. ఈ బాధలన్నీ పడి చివరికిచూస్తే గిండెకరాలకి 10×2=20 బస్తాలు ప్రతీయేడూ వచ్చే మగతాకూడా తగ్గింది నాకృషి ఫలితం.

ఆమీద ధోరణిమారింది. పత్రికలలో మామిత్రులపేర్లు కథలముందర వ్యాసాలముందర చూడటంచేతనూ, ఏదో చదువుకున్నాంకదా చేతనయినంత సారస్వత సేవ చేద్దామనీ ఏకథో, ఏవ్యాసమో రాత్రింబవళ్లు పనిచేసి కాయితం ఖరీదెక్కువయినా వాళ్ల యిష్టప్రకారం ఒకవైపు అందమైన అక్షరాలతో రాసి పంపుదును కదా నూడుకొన్లుదండగే గానిపత్రికలో పడదే. ఇల్లా కొన్నాళ్లు దండగని ఎంచక పిచ్చి పుట్టినపుడల్లా ఏదోకథో, వ్యాసమో రాసి పంపగా పంపగా, వీడెవడో బి, పి. లా తగులుకున్నాడురా అని విసుగొచ్చి కావును ప్రకటించడం ప్రారంభించారు. పోనీ పాపం అని దయతల్చి, వ్యాసం ప్రకటించుకున్నాం అని ఓకానీ అయినా పంపరుసరికదా, పత్రికయినా దానకర్ణుణ్ణి చంపిపుట్టిన ఏ మహనీయులో తప్ప మిగతావారు ఆ ఆనవాయితీ కూడా తప్పించేశారు.

చదువుకున్నందుకు ఫలితమిది.

ఇంతకీ నాపని, పనిలేని మంగలి పిల్లితల గొరిగితే వాడి కత్తి మొన పోవడమే కాకుండా, మీదపడి కరిచినా ఎల్లా సహించుకోవాలో, అల్లాగే నేను చేసే కృషిలోనూ—అని ఏ నీబోటివాళ్లైనా అంటే నేను సిగ్గొదిలిపెట్టేశా- అంటూ ఇంకా ఏదో చెప్పడానికి పెదివి అల్లలాడిస్తూ ఉంటే—అర్జంటు పని ఉంది కెళ్లోస్తానా అని వదిలించుకునేసరికి మా తాతలు దిగొచ్చారు.

ఆకుకూరలు

అవిసె – ఉస్తి – కరివేప – కామంచి – కాబేజీ – కొత్తిమిరి – కోలపాల – గుంటగలగర – గోగు – చక్రవర్తి – చామ – చింత – చిత్రి – చిలుకకూర – చుక్క – తమలపాకు – తుమ్మి – తోటకూర – దొగ్గలి – దోస – నీరుల్లి – పుదీనా – పొన్నగంటి – బచ్చలి – బలుసు – బొద్ది – మునగ – మెంతి – వేప – సరస్వతి – సీకాయ అనే ముప్ఫయి ఒక్కరకాల ఆకుకూరల వివరాలు గలవు. ఆకుకూరల ప్రాశస్త్యాన్ని వివరించే చక్కని పీఠికకూడా వున్నది.

*

పత్రికల ప్రశంసలు

ఆకులను కూరలుగా వండుకొనియో, పచ్చివిగానే భుజించియో ఆరోగ్య భాగ్యమునకై ఏమేమి లాభములను పొందవచ్చునో తెలుపబడినది. —గోలకొండ.

ఇందులోవున్న విషయాలు అందరూ తెలుసుకోదగిన వనేది నిర్వివాదాంశం.

—ఆంధ్ర వారపత్రిక.

చదవనేర్చిన ప్రతిస్త్రీ తప్పక చదవతగ్గ గ్రంథం. —జ్యోతి.

*

ప్రతికోసం

రెండు అణాలు

పోస్టుబిళ్ళలు పంపేది.

ఆంధ్ర భూమి బుక్కు డిపో
వేపేరి : మదరాసు.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౨౮౧

హిందూ దేశ చరిత్ర

హిందూదేశచరిత్రను రెండు భాగాలుగా విభాగించి మొదటిభాగములో మొదటిఫారము విద్యార్థులకు హిందూ మహాయుగ చరిత్ర; రెండవభాగములో రెండవఫారము విద్యార్థులకు మహమ్మదీయ, మహారాష్ట్ర, బ్రిటిష్ మహాయుగ చరిత్ర రచియించి గ్లేజు కాగితములమీద చక్కగ ముద్రించి శ్రీ నేలూరి సత్యనారాయణ, బి.ఏ.బి.ఎల్ గారు ఆంధ్ర విద్యార్థుల కృతజ్ఞతకు పాత్రులయినారు.

చరిత్ర రచనలో సత్యనారాయణగారు సిద్ధహస్తులగుట ఆంధ్రుల కెల్లరకు తెలిసిన విషయమే. విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో ప్రచురితమైన బౌద్ధ మహాయుగము తెలుగులోని చారిత్రక ఉద్గ్రంథాల్లో ఒకటి. బౌద్ధ మహాయుగ మేకాక ఫాహియాన్ హిందూదేశయాత్ర మున్నగు మరికొన్ని చారిత్రక గ్రంథాలను కూడా శ్రీవారు రచియించి వున్నారు.

అట్టి అనుభవజ్ఞులు విద్యార్థులకొరకు చారిత్రక గ్రంథాలు రచియింప పూనుకోవడం ప్రశంసనీయ విషయం.

మొదటి పుస్తకం వెల ఎనిమిది అణాలు. రెండోపుస్తకపు వెల పది అణాలు.

కలయువారు గ్రంథకర్తపేర ఇతిహాస తరంగిణీ గ్రంథనిలయం, భీమవరం పడమటి గోదావరిజిల్లా అని వ్రాసేది.

౨౮౨

వడ్లగింజలు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చిన్నకథలలో ఇది ఐదో సంపుటముగా ప్రచురితమైనది. 1941 లో ఆంధ్రవార పత్రికలో వారక్రమాన్ని ప్రచురితమైన 'వడ్లగింజలు'అను కథకు గ్రంథరూపము. కళాప్రపూర్ణ, సాహిత్య సామ్రాట్టు జయపురం మహారాజా శ్రీవిక్రమదేవవర్మ (డి.లిట్) గారి ద్రవ్యసహాయమున ఈ కాగితపు కరువు రోజుల్లో ఈ గ్రంథాన్ని ముద్రింపగలిగినామని శ్రీ శాస్త్రిగారు గ్రంథావతారికలో తెలిపి వున్నారు. ఈ విషయములో శ్రీరాజావారు పాత్రత బాగా గుర్తించి దానముచేశారని చెప్పవచ్చు. శ్రీ శాస్త్రిగారు ఆధునికాంధ్ర రచయితల్లో ఉపజ్ఞా మహితులు. అయితే ఆంధ్రలోకము వారిని ఆదరింపవలసినంతగా ఆదరించడంలేదు. అముద్రితాలయి వారి రచనలు ఏన్నో పడివున్నాయి. ముద్రితాలయివున్నవారి ప్రశస్త రచనల్ని విరివిగా కొనడంవల్ల ఆంధ్రప్రజలు అముద్రితాలయిన వారి ఇతర ప్రశస్తరచనలు ముద్రితము కావడానికి తోడ్పడినవారు అవుతారు. కాబట్టి ఆంధ్రులు ఈ విషయంలో కొంచెం శ్రద్ధ వహించవలసి వుంది.

మన ప్రస్తుత విమర్శకు పాల్పడివున్న శ్రీశాస్త్రిగారి 'వడ్లగింజలు' వారి ప్రశస్త రచనల్లో ఒకటి. శాస్త్రీయమైన వ్యావహారిక రచనకు ఈగ్రంథాన్ని ఒక తార్కాణంగా ఎంచుకోవచ్చు.

క్రౌనుసైజున దాదాపు 140 పుటలు. వెల ఆరు అణాలు. ప్రతులకు శాస్త్రిగారిపేర పశ్చిమగోదావరిజిల్లా, ఖండవిల్లిపోస్టు, ముక్కామలకు వ్రాసేది.

౨౮౩

'బ్రాకట్ల' ప్రహసనము

రచయిత శ్రీ శర్మగారు. హాస్యధోరణిలోవున్న చిన్న పుస్తకం. వెల అణన్నర. ప్రకటనకర్త : అకొండి వేంకటశాస్త్రి, శ్రీశాంతిసదనము, ఇన్నీసుపేట, రాజమండ్రి.

౨౮౪

నెహ్రూ చరిత్ర

భారత భాగ్యవిధాత ఐన పండిత జవహరిలాల్ నెహ్రూ జీవితచరిత్ర. కాకినాడ వకీలు శ్రీ కో. శఠకోపాచార్యులువారు వ్రాసినది. ఇది మూడవకూర్పు. శోధితము, సంవర్ధితము.

నెహ్రూ కుటుంబగాథ, జవహరిలాల్ తండ్రి ఐన మోతీలాల్ జీవితం, జవహరిలాల్ సిద్ధాంతాలు మున్నగునవి చక్కగ వివరింపబడ్డాయి. ఈ గ్రంథ

పతనమువలన ఆధునిక భారత రాజకీయ పరిజ్ఞానము కరతలామలకమగును.

గ్లేజు కాగితాలు. 230 పుటలు. వెల ఎనిమిది అణాలు.

౨౮౫

రక్తాశ్రువులు

కార్మిక కర్షక సమస్యలకు సంబంధించిన గేయాల సంపుటి. ఈ గేయాలు చదవడంవల్ల కార్మిక కర్షకులపట్ల ప్రతివారికి జాలికలుగుతుంది.

రచయిత. శిల్లా రాజులురెడ్డి. వెల నాలుగు అణాలు. క్రౌనుసైజున 60 పుటలు.

దొరుకుచోటు : శిల్లా రాజులురెడ్డి సోదరులు, పల్లిపేట, కళింగపట్టణము, ఉత్తర విశాఖపట్టణం జిల్లా.

౨౮౬

ప్రబోధకౌముది

శంకరభగవత్పాదుల రచనకు తెనుఁగుసేఁత. అనువాదకుఁడు : దేవగుప్తాపు వెంకటరమణ కవిరాజు. వెల 0-4-6. దొరకుచోటు : కవిరాజు గ్రంథమాల, వెంపడాం, శేరపోస్టు, (వయా) నెల్లిమర్ల.

౨౮౭

మధుకణములు

సికింద్రాబాదు (68-బి, బన్సీలాల్ పేట) సాధనసమితి ప్రధానాధ్యక్షులయిన శ్రీ పిల్లలమర్రి వెంకట హనుమంతరావుగారి పద్యరచనలు పై పేరుతో పుస్తకరూపాన్ని ప్రచురిత మయినాయి. ప్రమగణ శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారి పీఠికతో ఒప్పుతూవుంది. వెల ఆరు అణాలు.

౨౮౮

శ్రీ సూర్యప్రభువు

ఇందు సూర్యునిగురించిన సమస్త విజ్ఞానమున్నూ క్రోడీకరింపబడివున్నది. పిఠాపురము రాజకుమారులకు అంకిత మీయబడినది. శ్రీ రాయసం వెంకట శివుడుగారి పీఠిక. పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకా కాకరపర్రులోని ఆత్రేయాశ్రమస్వామిదారులు, ఈగ్రంథ కర్తలు వీన శ్రీ ఆకుండి వెంకటశాస్త్రి గారికి వ్రాస్తే ప్రతులు పొందవచ్చు. వెల తెలియదు.

౨౮౯

కలిసంతారణోపనిషత్తు: అహల్యాస్తవము

సంస్కృతమున బ్రహ్మసంవాదరూపమున ప్రకటనమైన కలిసంతారణోపనిషత్తును — అధ్యాత్మరామాయణములోని అహల్యాకృతరామస్తోత్రానికిని తెలుగు తాత్పర్యము. సంస్కృతమూలము, తెనుగు తాత్పర్యముకూడ ముద్రితమైనాయి. అనువాదకుడు : డాక్టరు పురాణపండ రామమూర్తి. వెల రెండు అణాలు. ప్రతులు కోరేవారు గ్రంథకర్తపేర తూర్పు గోదావరిజిల్లా అలమూరు వ్రాసేది.

౨౯౦

వలపు

ఆంధ్రభూమి పాఠకులకు చిరపరిచితులయిన శ్రీ తాతా కృష్ణమూర్తిగారు రచియించినది.

కామపురుషార్థానికి సంబంధించిన అనేక లలితవిషయాలు ఈగ్రంథంలో చక్కనిశైలిలో ప్రస్తావింపబడ్డాయి.

ఇందులో పదిప్రకరణాలువున్నాయి. వలపు, పెండ్లి, సరసం, జెలసీ, యుక్తవయసు, వావివరుసలు, చక్కదనం, వ్యభిచారం, సిగ్గు, విరహం అనేవి ప్రకరణ శీర్షికలు.

ఈ గ్రంథాన్ని అక్షరాస్యులయిన ప్రతివారు చదవవలసివుంది.

క్రౌనుసైజు. దళసరికాగితాలు. నూరు పుటలు. వెల ఆరు అణాలు.

ప్రకటనకర్తలు: నమ్మాళ్వార్సు, మద్రాసు బజారు, గుంటూరు.

౨౯౧

హంసవింశతి

శృంగారకావ్య గ్రంథమండలి ప్రబంధపరంపరలో నాలగవ పుస్తకము. అయ్యలరాజు నారాయణామాత్యుడు రచియించినది.

ఆంధ్రవారపత్రికను, భారతీ మాసపత్రికను సమర్థతతో నిర్వహిస్తూవున్న శ్రీతిరుమల వెంకటరంగాచార్య శిరోమణులు సుసంస్కృత మొనర్చి పాఠభేదములగూర్చి ఈ సుప్రసిద్ధ ప్రబంధాన్ని పండితశరణ్యంగా చేశారు.

నారాయణామాత్యుని మధురకవిత లలిత శృంగారవర్ణనలో ఈ కావ్యంలో

పారంముట్టింది. పైగా ఈకావ్యం తాను పుట్టిన నాటి ఆంధ్రసాంఘికవ్యవస్థను బాగా వెల్లడిస్తూవుంది.

ప్రాచీనాంధ్ర ప్రబంధమణిహారంలో ఒక అనర్ఘ మణి వినహంసవింశతిని సుందరతరంగా ముద్రించినందుకు మచిలీపట్టణములోని శృంగారకావ్యగ్రంథమండలి వ్యవస్థాపకులయిన శ్రీ కే. జి. మూర్తిగారిని మిక్కిలి కొనియాడుతున్నాము.

శృంగార కావ్య గ్రంథమండలిలో సభ్యులుగా చేరువారు మాత్రమే ఈ గ్రంథాన్ని బడయగలరు.

—······—

౩౯_౨

శ్రీమహారాజ విక్రమ దేవవర్మ రచనలు

శ్రీ జయపురాధీశులును సాహిత్య సామ్రాజ్యమహారాజోపాధియుతులునగు శ్రీ విక్రమ దేవవర్మ డి.లిట్. వారు తెనుగు పత్రికలందు అప్పుడప్పుడు ప్రకటిస్తూ వచ్చిన ఖండకవితలను, కథలను, ఉపన్యాసాలను, మంతవ్యాలను ఇది గ్రంథరూపము.

విడివడి విస్మృతిగహనము పాలైవున్న వీటినన్నిటిని విశేష శ్రమకోర్చి సేకరించి జయపుర సంస్థానపు దివానులు, ప్రశస్త చిత్రకారులు ఐన శ్రీ తలిసెట్టి రామారావు, బి.ఏ; బి.ఎల్ గారు గ్రంథరూపాన్ని వెలయించారు.

. వివిధవిషయాలనుగూర్చిన ఇందలి విషయాలను చదువుతూవుంటే శ్రీవారి విజ్ఞాన వైభవం ఆహాపుట్టిస్తూవుంటుంది.

మహావాక్యరత్నాలు

గట్టికర్రను కోసే రంపకారికంటె దీర్ఘక్రోధచలితుడు తన శరీరంలోని ఎక్కువ భాగ్గను కాల్చివేసుకుంటాడు.

—*Lloyd C. Douglas*

దినానికి ఉద్దిష్టమైనపనిని నిజాయితీగా చేయడమన్నదే జీవితం. సూర్యుడు అస్తమించి మనం ఇంటికిరాగా మనకు కలిగే మరణమే మకరోజు కూలి.

—*Whyte Melville*

జీవితంలో సుఖంఅన్నది ఆ మనిషి జీవించే విధానంలోవుందే కాని. ఆ మనిషివుంటే స్థలంలోనూ, చేసే పనిలోనూ లేదు.

—*R. W. Emerson*

జయం అన్నది అదృష్టంమీదనే ఆధారపడివుంటుందని నీరసహృదయులు నమ్ముతారు. —*Sir Frederick Treves*

నా ఆత్యాశను, లోభాన్ని చూచి నా ఆస్థానికులు నవ్విరా నేను భరింపగలను. నా దుబారావ్యయానికి నాప్రజలు గోడుగోడున దుఃఖించడం మాత్రం నేను చూడలేను. —*Louis XII*

ప్రపంచంలో ప్రతిప్రాణికి నిద్రపోవడం సహజగుణం. కాని నిద్రమత్తు బద్ధకమనేది ఒక్క మానవుడికే వున్న గుణంగా మనం పరిగణించవచ్చు.

—*F. A. Hornibrook*

ఆదర్శప్రాయమైన అనుభవసూక్తులు పలికేవారికంటె మంచిపనులుచేసేవారే ఎక్కువ విలువకలవారు.

—*Sidney Smith*

కవులకు నీతి అనేదిలేదు. అవసరమైతే వాళ్లు తల్లిపాలనుకూడా సిరాగా మార్చి గ్రంథరచనం చేస్తారు.

—*Bernard shaw*

యుద్ధాన్నిగురించి పెద్దల పలుకులు

యుద్ధం అన్నది కిరాతుల వ్యాపారం.

—*Napoleon*

యుద్ధ సందర్భంలో భయపడవలసిన విషయాలు రెండు వున్నాయి. అందులో మొదటిది యుద్ధంలో ఓటమి- రెండోది యుద్ధంలో గెలుపు.

—*Wellington*

యుద్ధాలు యుద్ధాల్ని ముగించలేవని నేను ఇప్పుడు తెలుసుకున్నాను.

—*Henry Ford*

ఆటవస్తువులలోని యుద్ధభటునిబొమ్మకూడా నాశనంచేయబడాలి. యుద్ధవైముఖ్యం చిన్ననాటనుంచీ అలవరచాలి.

—*Dr. Paulina Luisi*

యుద్ధాన్ని కేవలం బూతుగాఎప్పుడు పరిగణిస్తామో అప్పుడు యుద్ధం ప్రజామోదానికి దూరమవుతుంది.

—*Oscar wilde*

దానివల్ల ప్రయోజనంలేదని ప్రజలకు తెలియడంతోటే యుద్ధమనేది ప్రపంచంలో లేకుండాపోతుంది.

—*Robert Andrews Millikan*

నాయుద్ధవ్యాపారం సాగకుండా చేయవలసిన బాధ్యత మతానిది.

—*Field Marshal Earl Haig*

ఎంత ఖరీదైనాసరే, ఎంతధననష్టమైనా సరే, ఎంత గౌరవహాని ఐనా సరే నాకు కావలసింది శాంతి.

—*Ethel Mannin*

యుద్ధంకంటె కిరాతప్రభుత్వమైనా మేలు.

—*Pierre Ramus*

కారపు శనగలు

కాలం ఒడుదుడుకుగా వున్నప్పుడు ప్రాఫెట్‌లు స్వయంభువులవుతూ వుంటారు.

అట్లా పుట్టుకువచ్చిన నేటి మన ప్రాఫెట్‌లలో అరవరాజాజీ ఒకడు.

ఇంతట్లో జపాన్ మనకోస్తామీదికి రాదన్నాడు రాజాజీ ఢిల్లీలో కూచుని ప్రాఫెట్‌లా మాట్లాడుతూ.

కాని అతని జోశ్యం అంతలోనే అబద్ధమైంది. అతను ఆమాటలు అంటూ వుండగానే జపాన్‌వాడు మదరాసు కోస్తాలో విశాఖపట్టణం, కాకినాడ రేవుల మీద బాంబులు వేశాడు.

ఇందుతో రాజాజీ తన్నుతాను ప్రాఫెట్‌నుకోవడంలో చాలా తొందరపడి పప్పులో కాలువేశాడని స్పష్టమైంది.

అరవవాడైనా రాజాజీకి పూర్వపు అరవవేదాంతి ధోరణి అలవడకపోవడం శోచనీయం.

పూర్వం అరవదేశంలో ఒక వేదాంతి వుండేవాడు. అతగాడు అతిదోరణిలో రాగల కాలంలో ఇల్లా జరుగుతుందనీ, అల్లా జరుగుతుందనీ అంటూవుండేవాడు,

చివరనిమాత్రం—'కాని ఏమి జరుగుతుందో వేచి చూద్దాము'—అంటూ వుండేవాడు.

దరిమిలాను తాను చెప్పినట్లు జరిగినా, మరోలా జరిగినా అతగాడుమాత్రం నేను చెప్పలేదా అంటూ వుండేవాడు.

ఆదోరణి మెలుకువ ఐనా రాజాజీ ఎందుకు వహించలేదో నాకు ఆశ్చర్యంగావుంది.

... ...

విజాతీయ సైనికుల్ని పట్టి తెచ్చి వియ్యంకుళ్ళలా మేపడం నేటి యుద్ధధర్మమైవుంది.

ఆ సైనికులు తమ ప్రభుత్వంచేతనైనా అంతటి గౌరవ మర్యాదలతో చూడబడ రవడం అతిశయోక్తికాదు.

ఇందుకు ఒక నిదర్శనం చూపుతాను.

జపాన్ సైనికులు యుద్ధరంగంలో వున్నప్పుడు చవకబారులో వున్న ముతక గుడ్డలు రెండు కట్టుకుంటారు.

కెనడాలో ఇంటరన్ చేయబడ్డ జపాన్ రాయబారి ఇందుకు విరుద్ధంగా తనకు పదమూడు కొత్తసూట్లు కావాలని, అవి అన్నీ కొత్త మాదిరిలో వుండాలని అన్నాడట.

సూట్లు తయారైన తరవాత ఆ సంగతి కెనడా ప్రభుత్వంవారికి తెలిసింది. అప్పుడు ఆ ప్రభుత్వంవారు ఆసూట్లు ఆ రాయబారికి ఈయబడకూడదని నిషేధించారు.

... ...

మదరాసు కాంగ్రెస్ ప్రభుత్వంవారు తమ హయాములో పేర్లకు ముందర మహారాజశ్రీ, రాజశ్రీ, మిస్టర్ మున్నగు వాటికి బదులుగా శ్రీ చేర్చాలనే ఆచారాన్ని నెలకొల్పారు.

బ్రాహ్మణేతర నాయకులు, కొందరు తమిళనాయకులు ఈ శ్రీశబ్దానికి అభ్యంతరం తెలుపుతూ శ్రీస్థానంలో ద్రావిడ శబ్దమైన తిరు వుండాలనే ఆందోళన లేవదీశారు,

ఈ శ్రీ - తిరు శబ్దాల్లో ఏది శ్రేష్టమైనది అనే వాదోపవాదాలతో మదరాసు పత్రికలు ఈ మధ్య ముఖరితాలు ఔతున్నాయి.

శ్రీ శబ్దం సంస్కృత భాషాశబ్దం. పైగా శ్రీకార స్వీకారం ఉత్తరహిందూస్థానపుమర్యాద. కాగా దానిని చేకొనడం ద్రావిడ దాక్షిణాత్యులకు ఇష్టం లేకపోయింది.

కాగా తిరుశబ్దంమీద మోజు ఎక్కువయింది.

ప్రభుత్వంవారుకూడా దీనిని గుర్తించారు. తిరుశబ్దవిషయనిర్ణయాన్ని లోకాభిప్రాయానికి వదిలారు.

ఐతే తిరుశబ్దానికి అదృష్టదినాలు రాలేదనుకుంటాను. ఏమంటే 'శ్రీ' పదప్రాపకుడైన మదరాసు మాజీ ప్రధాని రాజగోపాలాచార్యులు తిరిగి మదరాసు ప్రధాని కానున్నాడు.

ఐవనాడు తిరుశబ్దానికి తిరి కాక మరియేముంది? తిరుశబ్దం అదృష్టంచేసి పుడితే రాజాజీ తిరిగి మదరాసు ప్రధాని కాకుండా వుంటాడు.

Printed at the Andhrabhumi Printing Works, 13 Mukhatal Street. Vepery P.O, Madras
Editor & Publisher : Andra Seshagiri Rao B.A.

ఆంధ్రరమణీమణులు భా-౧

ఇందు — కాకతీయాంధ్రసామ్రాజ్యసింహాసన మధిరోహించి జనరంజకముగ, శత్రుభయంకరముగ రాజ్యమేలిన రుద్రమ్మ; ధరణికోట సింగపుపీఠి నెక్కి అసామాన్యముగ రాజ్యచక్రము త్రిప్పిన గణపమ్మ; ఆంధ్రదేశమున ఆడుదియై పుట్టిన మంత్రిరాక్షసుని అపరావతారముగా నాయకురాలను బిరుదుగాంచిన పలనాటి నాగమ్మ; కౌగిలిలోనున్న భర్తను దీవించి కరవాల మొసగి కదనరంగమునకంపిన మాంచాల; ప్రజారంజకముగ పెద్దాపుర సంస్థానమును పాలించి తురక ఫౌజుదారుని బారి పడకుండ జోహారొనర్చిన అభిమానస్వరూప రాగమ్మ; ఆమె చేతులనుండి ఆమె మనుమని ఏడు మాసముల కసుగందుని గ్రహించి పంచకర పాట్లుపడి అరసి రక్షించిన స్వామిభక్తిపరాయణ మహాలక్ష్మమ్మ; పతియగు రాయజగపతితో సహగమన మొనర్చుచు పతి విరోధియగు ఆనందరాజునకు తిరుగని శాపమిచ్చిన మహాపతివ్రతాతిలకమగు సీతమ్మ; రాణివాసపు స్త్రీలందఱికంటె ముందుగా దాను కత్తి కెరయై మానమెఱిగిన స్త్రీత్వమునకు మొదలి పేరైన బొబ్బిలిరాణి మల్లమ్మ; నిండు చూలాలయ్యు మానసంరక్షణార్థమై నిజప్రాణముల ఖడ్గమున కెరచేసిన రమణమ్మ — వీరల అద్భుత చరితలు ఆంధ్రాభిమానముతో ప్రస్తరింపబడినవి.

౨-వ కూర్పు. 112 పుటలు. దళసరి కాగితములు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్రరమణీమణులు భా-౨

ఇందు — రణరంగమున వీరవిహారము విరమించి యింటికి వచ్చిన పతికి వీరసందేశమిచ్చి తిరిగి కదనభూమికి పంపి అతనికి వీరస్వర్గమిప్పించిన ఆంధ్ర వీరపత్ని చానమ్మ- మానముకొఱకు, మాటవాసికొఱకు తన్ను తాను పొడుచుకొని చనిపోయిన తంజావూరి తెనుగురాణి రాజగోపాలమ్మ- యీ రాజగోపాలమ్మ మనుమని చెంగమలదాసుని విక్రాంతిసమయమున అరసి రక్షించి తన ప్రభుభక్తిని ప్రకటించిన దాది - మధుర ఆంధ్రనాయక రాజ్యపాలనమును మహనీయముగ సాగించి దానవిరతిని, ఆంధ్రభాషాభిమానమును అతిశయముగ ప్రదర్శించిన మంగమ్మ- దాందాసాహేబు మోసమునకు గుఱియైన మీనాక్షి- పథ్యముముట్టని పచ్చి బాలెంతరాలయ్యు తన సహగమనోద్యోగము నెఱవేరకపోగా పన్నీరుద్రాగి ప్రాణములు విడిచిన పతిప్రాణ ముత్తమ్మ ప్రజోపయోగమునకై శిశుసహితముగ బలిపోయిన సంగమ్మ వీరల పవిత్రచరిత్రలు గలవు.

దళసరి కాగితములు. 100 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

కేయూరబాహుచరిత్ర

శిల్పము మెరయ మంచన మహాకవి రచియించిన కేయూరబాహుచరిత్ర అను పద్యకావ్యమును ఆధారముగ తీసికొని తేట తెనుగు వచనమున జనసామాన్యముకొఱకు వ్రాయబడినది. పెండ్లాడినవానిని సార్వభౌమునిగా జేయు వరమునొందిన మృగాంకావళియను నొక రాజకన్యను కేయూరబాహువను రాజునకు నతని ధర్మపత్నిచే భాగురాయణుడను నాతని మంత్రి నిజబుద్ధిబలమున వివాహము చేయించిన వృత్తాంత మిందలి ప్రధానకథ. నడుమ నడుమ చక్కని నీతికథలు పెక్కులు గలవు.

గ్లేజు కాగితములు. 90 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్రరాజభక్తులు

రాజభక్తి యనునది దేశభక్తికి పర్యాయపదముగా రాణించుచుండిన ఆంధ్రదేశపు స్వతంత్రయుగ చరిత్రలలో రాణించు రాజభక్తిశిఖామణులగు విశ్వనాథనాయుడు, యాచమనాయుడు, అబ్దుర్ రజాక్ లారీ, కరిబసవస్వామి, తిక్కన మంత్రి, మహాలక్ష్మన్న, పాపారాయుడు, హనుమప్ప నాయుడు అను ఎనమండుగురి చరిత్రలను కీర్తించు గ్రంథము.

గ్లేజు కాగితములు. 104 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

REGD. No. M. 4204. ANDHRABHUMI Estd 1933.



ప్రపంచవీరులు

రచయిత:

శ్రీ కొత్తపల్లి శ్రీ రామమూర్తి

గులాబిగుచ్ఛము

దేశభాషలందు తెలుగులెస్స

ప్రసూనము: ౧

గ్లేజు కాగితములు. 96 పుటలు. ప్రతి 1-కి 8 అణాలు. పోస్టుఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.